
నిరీక్షణ..!


ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లి నిల్వలు (ఫైల్)

సి. బెళగల్ మండలం తిమ్మందొడ్డి గ్రామానికి చెందిన ఓ రైతు రెండెకరాల్లో ఉల్లి సాగు చేశాడు. పంట చేతికొచ్చే సమయంలో ధర పతనమైంది. ప్రభుత్వం క్వింటాకు రూ.1,200 మద్దతు ధర ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడంతో సంతోషించాడు. 86 క్వింటాళ్లు గత సెప్టెంబరు మొదటి వారంలో కర్నూలు మార్కెట్ యార్డులో ఏపీ మార్క్‌ఫెడ్‌కు విక్రయించాడు. వారంలో రోజుల్లో రూ.1.03 లక్షలు ఖాతాలో జమ చేస్తామన్నారు. దాదాపు రెండు నెలలు గడిచినా ఉల్లి డబ్బులు ఇవ్వలేదు. పెట్టుబడికి చేసిన అప్పులు, వడ్డీలు పెరిగిపోయి నష్టపోతున్నానని, పంటను అమ్మి రెండు నెలలైనా ప్రభుత్వం డబ్బులు ఇవ్వలేదని రైతు అంటున్నాడు. అప్పు కట్టలేక అబద్ధాలు చెబుతున్నావని రుణదాతలు అంటున్నారని ఆవేదన చెందాడు. ఇది ఆ ఒక్క రైతు వ్యథే కాదు. ఏపీ మార్క్‌ఫెడ్‌లో, మార్కెట్‌లో ఉల్లి విక్రయించిన 2,445 మంది రైతుల బాధ. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉల్లి డబ్బులు ఇవ్వాలని కన్నీరు పెడుతున్నారు.

- రెండు నెలలు గడిచినా రైతుల ఖాతాలో జమకాని ఉల్లి డబ్బు
- చెల్లించాల్సిన మొత్తం రూ.17 కోట్లు
- ఇప్పటికి ఇచ్చింది రూ.2.11 కోట్లే
- మార్క్‌ఫెడ్ కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- వడ్డీలు పెరిగిపోతున్నాయని ఏకరువు



కర్నూలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక ఉల్లి సాగు చేస్తున్న జిల్లాల్లో కర్నూలు ఒకటి. సాధారణ సాగు విస్తీర్ణం 45,278 హెక్టార్లు. పంట దిగుబడులు చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలకు ఉల్లి దిబ్బతిని దిగుబడి కూడా భారీగా తగ్గిపోయింది. చేతి కొచ్చిన అరకొర పంట దిగుబడులు విక్రయించేందుకు కర్నూలు మార్కెట్ వెళ్తే ధరలు పతనమై కూలి, రవాణా ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని పలువురు రైతులు పొలంలోనే వదిలేశారు. కొంతైనా చేతికొస్తుందని కర్నూలు మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతులు కొందరు లారీల బాడుగులు చేతి నుంచి కట్టాల్సి వచ్చింది. క్వింటా కనిష్ఠంగా రూ.వంద కూడా పలకపోవడంతో మట్టిలో పోసిన పెట్టుబడి, భార్యాపిల్లల కష్టం మట్టిపాలైంది. ఉల్లి రైతుల కన్నీటి కష్టాలను 'ఆంధ్రజ్యోతి' పలు కథనాల ద్వారా వెలుగులోకి తెచ్చింది. సీఎం చంద్రబాబు సారథ్యంలోకి కూటమి ప్రభుత్వం స్పందించి ఉల్లి క్వింటా మద్దతు ధర రూ.1,200 ప్రకటించడమే కాకుండా ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. అదే క్రమంలో వ్యాపారులు కొనుగోలు చేసినా మద్దతు ధర, కొనుగోలు ధర వ్యత్యాసం అమౌంట్ ప్రభుత్వం చెల్లిస్తుందని ప్రకటించింది. అప్పటి జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మార్కెట్‌కు వెళ్లి ఏపీ మార్క్‌ఫెడ్‌కు అమ్మాలని, వ్యాపారులకు విక్రయించినా వ్యత్యాసం అమౌంట్ ప్రభుత్వం చెల్లిస్తుందని భరోసా ఇచ్చారు.

రెండు నెలలైనా ఖాతాలో జమ కాని ఉల్లి డబ్బులు

కర్నూలు మార్కెట్ యార్డులో ఆగస్టు 31 నుంచి మద్దతు ధర రూ.1,200 ప్రకారం ఏపీ మార్క్‌ఫెడ్ నేరుగా కొనుగోలు చేసింది. మార్కెట్ యార్డు లైసెన్స్‌డ్ వ్యాపారులు పర్చేజ్ డిఫరెంట్ ప్రైజ్ స్కీం (పీడీపీఎస్) కింద కొనుగోలు చేసిన ఉల్లి ధరపై వ్యత్యాసం అమౌంట్ (ఉదా: వ్యాపారికి క్వింటా రూ.350కు కొనుగోలు చేస్తే మిలిగిన వ్యత్యాసం డబ్బులు రూ.950 ప్రభుత్వం చెల్లిస్తుంది) ప్రభుత్వం చెల్లిస్తుంది. ఏపీ మార్క్‌ఫెడ్, లైసెన్స్‌డ్ వ్యాపారులు 2,800 మంది రైతుల నుంచి దాదాపుగా 1.55 లక్షల క్వింటాళ్ల ఉల్లి సేకరించారు. రైతులకు రూ.17కోట్లు చెల్లించాల్సి ఉంది. వారం పది రోజుల్లోగా ఖాతాల జమ చేస్తామని ఏపీ మార్క్‌ఫెడ్ అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు. ఉల్లి అమ్మకాలు చేసిన రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, ఈక్రాప్ జిరాక్స్ కాపీలు తీసుకున్నారు. వారం పది రోజుల్లో ఖాతాల ఉల్లి డబ్బులు వస్తాయని, పెట్టుబడి వడ్డీలైన కట్టుకోవచ్చని ఆశించారు. అయితే రెండు నెలలు కావస్తున్నా నేటికీ ప్రభుత్వం ఉల్లి అమ్మిన రైతులకు డబ్బులు చెల్లించకపోవడం విమర్శలకు తావిస్తోంది. కేవలం 350 మంది రైతులకు రూ.2.11 కోట్లు మాత్రమే జమ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. 2,445 మంది రైతులకు రూ.14.89 కోట్లు చెల్లించాల్సి ఉంది. 2018-19లో కొనుగోలు చేసిన ఉల్లికి దాదాపు రూ.6.50 కోట్లకుపైగా రావాలి. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పటికీ ఒక్క పైసా ఇవ్వలేదు. తాజాగా రూ.14.89 కోట్లు చెల్లించాల్సి ఉంది.

వడ్డీలు పెరుగుతున్నాయి

బ్యాంకుల్లో ఇచ్చే పంట రుణాలు సరిపోక ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి వందకు రూ.2 వడ్డీ ప్రకారం అప్పులు చేసిన వారే ఎక్కువ మంది ఉన్నారు. కౌలు రైతులకు బ్యాంకుల్లో రుణాలే ఇవ్వడం లేదు. వంద శాతం ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధార పడాల్సిందే. మార్కెట్ నిబంధనల ప్రకారం పంట అమ్మిన రోజే అమ్మకం డబ్బు రైతులకు చెల్లించాలి. కొందరు వ్యాపారులు వారం పది రోజుల్లోపు ఇచ్చేలా మార్కెట్ యార్డు అధికారులు అనధికారిక ఒప్పందం చేసుకున్నారు. ప్రభుత్వమే ఉల్లి కొనుగోలు చేయడంతో వారం పది రోజుల్లో ఉల్లి అమ్మకం డబ్బులు వస్తాయని ఆశిస్తే.. రెండు నెలలైనా అందకపోవడం అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వడ్డీలు పెరగడమే కాక, అప్పులు ఇచ్చిన వారు రైతుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే ఉల్లి డబ్బు బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఏపీ మార్క్‌ఫెడ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మెజార్టీ రైతులకు ఏపీజీబీ బ్యాంక్ ఖాతాలు ఉన్నాయని, గ్రామీణ బ్యాంకులు వీలినం కారణంగా కొత్త బ్యాంక్ ఖతాలు రావడంతో ఈ సమస్య తలెత్తిందని, త్వరలోనే రైతులు ఖాతాలో జమ చేస్తామని పేర్కొనడం కొసమెరుపు.



ఏప్రిల్ నాటికి మున్సిపల్ భవనం పూర్తి

పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్


నూతన నగరపాలక కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర పాలక సంస్థ నూతన కార్యాలయాన్ని ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని అధికారులను పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. గురువారం ఆయన నూతన కార్యాలయ నిర్మాణ పనులను కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.28కోట్లతో నూతన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని చేపడుతున్నామన్నారు. ఇప్పటివరకు 50 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. భవనం 3 అంతస్తులు ఉండగా, పూర్తి విస్తీర్ణం సుమారు 3.12 ఎకరాల్లో ఉంటుందన్నారు. పనుల్లో వేగవంతం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి చెప్పారు. మంత్రి వెంట మేనేజర్ చిన్నరాముడు, ఇన్‌చార్జి ఎస్‌ఈ శేషసాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి, డీఈఈ గిరిరాజు, టీపీఈ ఖాసింవలి, కార్పొరేటర్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీకి నిధులు విడుదల చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి బకాయి పడిన రూ.2,700 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులను తక్షణమే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. నరేంద్ర మోదీ మెప్పు కోసం జీఎస్టీ సంబరాల పేరుతో రూ.వందల కోట్లు ఖర్చు పెట్టిన ప్రభుత్వానికి ఆరోగ్యశ్రీ బకాయిలు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేయకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి టి.రాముడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆనంద్‌బాబు, రామక్రిష్ణ, అరుణమ్మ, పాత బస్తీ కార్యదర్శి రాజశేఖర్, విజయ్, సుధాకరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సీఐల బదిలీ

కర్నూలు క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా పామిడి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న వి.యుగంధర్‌ను వెల్దుర్తి సర్కిల్ పోలీస్ స్టేషన్‌కు, అలాగే వెల్దుర్తి సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న బి. మధుసూదన్‌రావును కర్నూలు డీఎస్‌బీ-1 బదిలీ చేశారు.

ఉపాధి కూలీలకు కేంద్రం నిధులు

జిల్లాకు రూ.76 కోట్లు వస్తాయన్న డ్వామా పీడీ

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ఇప్పటి దాకా చేపట్టిన పనులకు కేంద్రం రూ.665 కోట్ల విలువైన మెటీరియల్ కాంపోనెంట్ నిధులను మంజూరు చేసినట్లు కర్నూలు జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికార వర్గాలు గురువారం తెలిపాయి. ప్రస్తుతం గ్రామాల్లో మౌలిక వసతుల కోసం సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, గోకులం షెడ్లు, మట్టి లింక్ రోడ్లు తదితర వాటిని పూర్తి చేసి రెండు నెలలు కావస్తోంది. జిల్లాలో చేసిన పనులకు రూ.76 కోట్ల దాకా మెటీరియల్ కాంపోనెంట్ నిధులు విడుదల కావాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ 655 కోట్లు విడుదల చేయడంతో కూలీలకు వేతనాలతో పాటు మెటీరియల్ కాంపోనెంట్ నిధులు కూడా త్వరలోనే జిల్లాకు రానున్నాయనీ జిల్లా నీటి యజమాన్య సంస్థ పీడీ వెంకటరమణయ్య తెలిపారు.



ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచాలి

- నాబార్డు ద్వారా ఆర్ఐడీఎఫ్ నిధులు వినియోగించుకోవాలి
- స్టాండ్ ఆఫ్ ఇండియా పథకంపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచాలని కలెక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో 3 రోజుల పాటు 91 శాఖల అధికారులతో ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించడంలో భాగంగా గురువారం వ్యవసాయం, ఉద్యాన, మార్కెటింగ్, సెరికల్చర్, మార్కెటింగ్, పశుసంవర్ధక, డీఆర్‌డీఏ, మెప్మా, నాబార్డు, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాబార్డు ద్వారా రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులను వినియోగించుకునేలా ఆయా శాఖల అధికారులు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. స్టాండ్ ఆఫ్ ఇండియా పథకంపై అవగాహన కల్పించి, ఎస్సీ, ఎస్టీ మహిళలకు రుణాల మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. చేనేతలకు ఇచ్చే ముద్ర రుణాలను మరింత పెంచాలన్నారు. సీసీఆర్‌సీ కార్డులు ఉన్న వారికి రుణాలు ఇప్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

19 మంది ఎస్ఐలు బదిలీ 6

నేటి నుంచి విశ్వశాంతి మహాయాగం
- కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి 7



ఉయ్యాలవాడలో నీట మునిగిన మిరప పంట

పోటెత్తిన కుందూ

- స్తంభించిన రాకపోకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- వేలాది ఎకరాల్లో నీట మునిగిన పంటలు

ఉయ్యాలవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో కుందూ నది వరదలు బీభత్సాన్ని సృష్టించాయి. మండలంలో కుందూనదిపై ఉన్న వంతెనపై వరద ప్రవాహం పోటెత్తింది. దీంతో రూపన గుడి, ఉయ్యాలవాడ, బోడెమ్మనూరు, పెద్దయమ్మనూరు, నర్సిపల్లె, సుద్దమల్ల, కాకరవాడ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నర్సిపల్లె, సుద్దమల్ల, రూపనగుడి, గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరి వారు నిరాశ్రయులుగా మిగిలారు. వేలాది ఎకరాల్లో వరి, మిరప, కంది, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు మునిగిపోయాయి. ఇవి దెబ్బతినే ప్రమాదం ఉంది. గురువారం సాయంత్రం వరద నీరు తగ్గుముఖం పట్టడంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వరద బాధితులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

నర్సిపల్లెలో ఇళ్లలోకి చేరిన వరద





భవనాశి నదిపై కొనసాగుతున్న వరద

ఆత్మకూరులో తగ్గని వరద

- భవనాశి ఉప్పొంగడంతో నిలిచిన రాకపోకలు
- తగ్గని సిద్ధాపురం అలుగు ఉధృతి
- స్తంభించిన ఆత్మకూరు - దోర్నాల రహదారి

ఆత్మకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో సంభవించిన మొంథా తుఫాన్ ధాటికి ఆత్మకూరు ప్రాంతంలో రెండు రోజుల పాటు కురిసిన వర్షాల ప్రభావం గురువారం కూడా తగ్గుముఖం పట్టలేదు. పట్టణ శివారులోని భవనాశి నదిపై వరద ప్రవాహం తగ్గుముఖం పట్టినప్పటికీ నీటి ఉధృతి ఉండటంతో ఆత్మకూరు నుంచి కురుకుంద, కొట్టాలచెరువు గ్రామాలతో పాటు కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అయితే తహసీల్దార్ రత్నరాధిక, అర్బన్ సీఐ రాము, ఎస్ఐ నారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు ఎక్స్‌కవేటర్ ద్వారా వంతెన దాటి కురుకుంద, కొట్టాలచెరువు, వడ్లరామాపురం గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అలాగే ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులను చేయించి సచివాలయ సిబ్బందికి తగు సూచనలు చేశారు. వడ్లరామాపురం గ్రామంలోని మల్లెలమ్మ చెరువుకు ఏర్పడిన గండిని పరిశీలించి సహాయక చర్యల గురించి ఆరా తీశారు. భవనాశిపై నీటి ఉధృతి తగ్గే వరకు ఎవరూ వాగు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. ఆత్మకూరు నుంచి వడ్లరామాపురం వెళ్లే మార్గంలోని పీతురువాగు ఉప్పొంగడంతో కురుకుంద నుంచే వారు వడ్లరామాపురం గ్రామానికి చేరుకున్నారు. కాగా వరదరాజ స్వామి ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల నిలిపి వేయడంతో అక్కడి పరిస్థితిని కూడా అధికారులు పరిశీలించారు. వరదల వల్ల భవనాశి పరిసర ప్రాంతాల్లోని పంటపొలాలు, ఇటుకల బట్టీలు దెబ్బతిన్నాయి. ఆత్మకూరు పట్టణంలోని లోతట్టు కాలనీల్లో నిలిచిన వర్షపునీటిని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు యుద్ధప్రాతిపదికన దారిమళ్లించే పనులు చేపట్టారు.

కూలిన మట్టిమిద్దెలు

జూపాడుబంగ్లా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాను వల్ల ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాల్లో 30 మట్టిమిద్దెలు కూలిపోయాయి. కూలిన మట్టిమిద్దెలను గురువారం తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, ఆర్ఐ మౌల బాషా పరిశీలించారు. తాటిపాడు, 80బన్నూరు, తరిగోపుల, మండ్లెం, పారుమంచాల, తూడిచర్ల తదితర గ్రామాల్లో బాధితులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



తాటిపాడులో కూలిన మట్టిమిద్దెను పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, అధికారులు

తగ్గని సిద్ధాపురం అలుగు ఉధృతి

తుఫాన్ వల్ల సిద్ధాపురం చెరువులోకి గరిష్టస్థాయిలో నీటినిల్వలు అలుగుల ద్వారా నీరు బయటకు వెళ్లోంది. ఇందులో భాగంగానే చెరువు పక్కనే ఉన్న కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై అలుగు జలాలు గురువారం కూడా ఉధృతంగా ప్రవహించడంతో ఆత్మకూరు - దోర్నాల మధ్య వాహనాల రాకపోకలు స్తంభించాయి. మధ్యలో నిలిచిపోయిన ప్రయాణికులకు, వాహన చోదకులకు ఇక్కడి అధికారులు భోజన, వసతి సదుపాయం కల్పించారు. నీటి ఉధృతి తగ్గుముఖం పడితేనే వాహనాల రాకపోకలకు అనుమతిస్తామని అధికారులు స్పష్టం చేశారు.



బండిఆత్మకూరు: పెద్ద దేవళాపురంలో నీటమునిగిన కాలనీ



నీటి మునక నుంచి బయటపడ్డ మిరప పంట

వివాహ వేడుకలకు మొంథా ఎఫెక్ట్..!

- వరదల్లో చిక్కుకున్న వధువు
- ట్రాక్టర్‌లో భవనాశి నది దాటిన పెళ్లి బృందం

ఆత్మకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ఓ పెళ్లింట్లో కాస్త గందరగోళానికి దారితీసింది. ముహూర్తం రోజే వరుడి ఊరికి చేరుకోవాల్సిన వధువు వరదల్లో చిక్కుకుని ఆ మరుసటి రోజు అత్తారింటికి పయనం కావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆత్మకూరు మండలంలోని కొట్టాలచెరువు గ్రామానికి చెందిన కళ్యాణిబాయికి అనంతపురం జిల్లా వజ్రకరూర్ మండలం ఎన్ఎన్‌పీ తండా గ్రామానికి చెందిన సురేష్‌నాయక్‌తో వివాహం నిశ్చయమైంది. అక్టోబరు 29న ముహూర్తం, 30న వివాహ తేదీలను వారి పెద్దలు నిర్ణయించారు. అయితే 28వ తేది రాత్రి మొంథా తుఫాన్ ధాటికి ఆత్మకూరు మండలంలోని విస్తారంగా వర్షాలు కురవడంతో నల్లమలలోని వరదరాజ స్వామి ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద చేరింది. దీంతో 29వ తేదిన ప్రాజెక్ట్ నుంచి మూడు గేట్లు తెరిచి 4,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ నీరంతా ఆత్మకూరు శివారులో ప్రవహిస్తున్న భవనాశి నదిలోకి చేరడంతో నది ఉప్పొంగి ప్రవహించింది. దీంతో ఆత్మకూరు నుంచి కురుకుంద, కొట్టాలచెరువు గ్రామాలకు రాకపోకలు జరిపేందుకు వీలు లేకుండా అంతరాయం నెలకొంది. వాస్తవానికి ముహూర్తం రోజైన బుధవారమే వధువుతో సహా వారి బంధువులు ఎన్ఎన్‌పీ తండాకు బయలుదేరాల్సి ఉంది. వరద తగ్గుముఖం పట్టకపోవడంతో వారు భవనాశి దాటలేని పరిస్థితి నెలకొంది. గురువారం భవనాశి నది వరద ఉధృతి కొంత మేర తగ్గడంతో ఎట్టకేలకు పెళ్లి బృందం ఓ ట్రాక్టర్ ద్వారా నదిని దాటారు. ఆ తర్వాత అక్కడి నుంచి ఇతర వాహనాల్లో ఎన్ఎన్‌పీ తండాకు బయలుదేరారు.



ట్రాక్టర్‌లో భవనాశి నది దాటుతున్న వధువు (వలయంలో)

ఎటు చూసినా ఉల్లి..

శనగ సాగు కోసం తొలగిస్తున్న రైతులు



ఉల్లి గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

కోడుమూరు రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి గ్రామంలో ఎటు చూసినా ఉల్లిగడ్డలు కనిపిస్తున్నాయి. వర్షం ఆగిపోవడంతో రైతులు ఉల్లిగడ్డలను తొలగించి కొండకు తరలిస్తున్నారు.

మోస్తరు ధర..

కొన్నిరోజులుగా క్వింటా ఉల్లి రూ.500లోపే ధర పలుకగా, తుఫాన్ తెరపినిచ్చాక రూ.800నుంచి రూ.వెయ్యి వరకు ధర పలుకుతుండంతో రైతులు ఊరట చెందుతున్నారు. నాణ్యమైన ఉల్లిని కోస్తా ప్రాంతానికి తరలించేందుకు ఓ వ్యాపారి రూ.1,200 చెల్లించి కొనుగోలు చేశారు. ఈ ధరల నష్టం నుంచి గట్టెక్కే పరిస్థితి లేదని, కేవలం ఉల్లి కోత ఖర్చులు వస్తాయని రైతులు అంటున్నారు. ఉల్లి పొలంలోనే ఉంటే శనగ సాగు సాధ్యం కాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కోస్తున్నామన్నారు.



శనగ సాగుతో గట్టెక్కాలని..



సొంత పొలం రెండెకరాలు, మరో రెండెకరాలు కౌలు తీసుకుని ఉల్లి సాగు చేశాను. రూ.2లక్షలు పైగా ఖర్చు చేసినా నష్టం వచ్చింది. రబీలో శనగ సాగు చేసి గట్టెక్కాలనన్న ఆశతో ఉన్నారు. ఉల్లి నష్టపోయిన మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

● మాదన్న, వెంకటగిరి



బస్సు ప్రమాదం జరిగిన ప్రదేశంలో బూడిదలో బంగారం వేట సాగిస్తున్న దృశ్యం

శవాల బూడిదలో...

- బస్సు ప్రమాదంలో 19 మంది అగ్నికి ఆహుతి
- ఆ ఘటనలో మృతుల బంగారు కోసం అన్వేషణ

కర్నూలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ఘోర ప్రమాదం దృశ్యాలు కళ్ల ముందు చెదిరిపోలేదు. మృత్యుఘోష వినిపిస్తూనే ఉంది. మంటల్లో చిక్కుకొని అగ్నికి ఆహుతి అవుతున్న అభాగ్యుల ఆర్తనాధాలు చెవుల్లో మారుమ్రోగుతూనే ఉన్నాయి. చావు అంచులుదాక వెళ్లి ప్రాణాలతో బయటపడిన వారు ఆ షాక్ నుంచి ఇంకా తేరుకోలేదు. అవేమీ పట్టని కొందరు మానవత్వం మరిచి.. బస్సు పూర్తిగా కాలిపోయి మాంసపు ముద్దగా మారిన మృతదేహాల బూడిదలో బంగారు, వెండి ఆభరణాలు కోసం వెతుకులాట సాగిస్తున్న కొందరి తీరు ప్రశ్నార్థకంగా మారింది. వారికి అది జీవనపోరాటమే కావొచ్చు.. జరిగిన ఘోరం మరవక ముందే బంగారు అన్వేషణ చేయడం ఏమిటి? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు సమీపంలో గత శుక్రవారం అర్ధరాత్రి మూడు గంటల సమయంలో హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారి-44పై బైక్‌ను ఢీకొని చెలరేగిన మంటల్లో వి.కావేరి ట్రావెల్ బస్సు పూర్తిగా కాలిపోయిన బూడిద కుప్పగా మారిన సంగతి తెలిసిందే. ఆ మంటల్లో చిక్కుకొని ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, బీహార్ రాష్ట్రాలకు చెందిన 19 మంది ప్రయాణికులు అగ్నికి ఆహుతి అయ్యారు. వారిలో ఆరుగురు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. చనిపోయిన వారిలో మెజార్టీగా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ప్రైవేట్ కంపెనీల్లో పని చేస్తున్నవారే. హైదరాబాద్‌కు దీపావళి పండుగకు బంధువులకు ఇళ్లకు వెళ్లి, తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురై మరణించివారు ఉన్నారు. పండుగకు బంధువుల ఇళ్ల వెళ్లిన వారు సహజంగానే బంగారు ఆభరణాలు ధరించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మనుషులతో పాటు వారి శరీరాలపై ఉన్న కాస్తో కూస్తో బంగారు, వెండి ఆభరణాలు కూడా వారితో పాటే కాలి బూడిదయ్యాయి. పోలీసులు, ఆర్టీఏ అధికారులు ప్రమాదానికి గురైన బస్సును ఎక్స్‌కవేటర్ ద్వారా స్థలం నుంచి పక్కకు తరలించారు. ఘటన స్థలంలో రోడ్డు పక్కనే బూడిద కుప్పలు పడ్డాయి. మృతులతో పాటు కాలిపోయిన బంగారు, వెండి ఆభరణాల కోసం కొందరు బూడిదను జల్లెడ పట్టారు. మహిళలు, పురుషులు క్షుణంగా పరిశీలిస్తూ అనుమానం వచ్చిన ప్రతి ముక్కనూ సంచిలోకి వేసుకుంటున్నారు. అక్కడికి సమీపంలో హంద్రీనీవా కాలువ నీటిలో కడిగి బంగారు ముక్కలు బయటకు తీస్తున్నారు. మృతదేహాలు కాలిన బూడిదలో బంగారు కోసం వేట సాగించిన వారు తెలంగాణ వాసులుగా స్థానికులు చెబుతున్నారు.



ప్రమాదానికి గురైన బస్సులో బంగారు ఆభరణాల కోసం వేట సాగిస్తున్న దృశ్యం

మద్దిలేటి స్వామి హుండీ ఆదాయం రూ.44.87 లక్షలు

బేతంచెర్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో కొలువైన మద్దిలేటి నరసింహ స్వామి హుండీ ఆదాయాన్ని అధికారులు గురువారం లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.44.87లక్షలు ఆదాయం సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. మద్దిలేటి స్వామి హుండీల లెక్కింపు దేవదాయ శాఖ పర్యవేక్షకులు రమేష్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. రెండు నెలలకు సంబంధించి జరిగిన లెక్కింపులో రూ.44,87,441 నగదు రూపంలో రాగా, 8.5గ్రాముల బంగారు, కిలో వెండి వచ్చిందన్నారు. ఈ లెక్కింపులో ఆలయ అర్చకులు సిబ్బందితో పాటు భక్తులు పాల్గొన్నారు.



మద్దిలేటి స్వామి క్షేత్రంలో హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

రూ.40 లక్షల ఆర్థిక సాయం

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు బస్సు ప్రమాద దుర్ఘటన బాధితులకు కావేరి ట్రావెల్స్ యాజమాన్యం రూ.40 లక్షలు ఆర్థిక సాయం అందజేసింది. గురువారం కలెక్టర్ చాంబర్‌లో కావేరీ ట్రావెల్స్ ప్రతినిధులు కలెక్టర్ ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సమక్షంలో బస్సు దుర్ఘటనలో మరణించిన, గాయపడిన వారికి చెక్కు రూపంలో మంత్రి టీజీ భరత్‌కి అందజేశారు. మరణించిన వారికి రూ.2లక్షలు చొప్పున 19 మందికి రూ.38 లక్షలు, తీవ్రంగా గాయపడిన నలుగురికి రూ.50వేల చొప్పున మొత్తం రూ.40 లక్షల చెక్కును అందజేశారు.

ఐటీడీఏలో నాగుపాముల కలకలం

శ్రీశైలం అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ఐటీడీఏ కార్యాలయంలో రెండు నాగుపాములు కనిపించడం కలకలం రేపింది. నిత్యం అధికారులు, సిబ్బంది, గిరిజనులతో రద్దీగా ఉండే ఆఫీసులో రెండు పాములను చూసి అక్కడున్న వాళ్లంతా భయాందోళనకు గురయ్యారు. శ్రీశైలం ప్రాజెక్ట్ స్నేక్ క్యాచర్ ముస్తాక్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి చాకచక్యంగా పాములను పట్టుకొని అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు.



స్నేక్ క్యాచర్ పట్టుకున్న నాగుపాము



19 మంది ఎస్ఐలు బదిలీ



కర్నూలు క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ పరిధిలో 19 మంది ఎస్ఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్ఐలు తక్షణమే విధుల్లో చేరాలని ఆయన ఉత్తర్వుల్లో ఆదేశించారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
డి.రమేష్ రెడ్డి	అన్నమయ్య జిల్లా, ఉమెన్ పీఎస్	కోసిగి
హనుమంతరెడ్డి	కోసిగి	కర్నూలు టూటౌన్
బి.సతీష్ కుమార్	కర్నూలు టూటౌన్	చిప్పగిరి
ఏ.పి.శ్రీనివాసులు	చిప్పగిరి	కర్నూలు ఫోర్త్ టౌన్
పి.మోహన కిశోర్ రెడ్డి	కర్నూలు ఫోర్త్ టౌన్	కర్నూలు తాలుకా
హెచ్.డాక్టర్ నాయక్	ఇస్వి	వీఆర్, కర్నూలు
జి.అశోక్	వెల్దుర్తి	గూడూరు పీఎస్
ఎం.తిమ్మయ్య	గూడూరు	కర్నూలు త్రీటౌన్
ఎం.నరేష్	కర్నూలు తాలుకా	వెల్దుర్తి
ఎం.పరమేష్ నాయక్	సి.బెళగల్	వీఆర్, కర్నూలు
యు.వేణుగోపాల్ రాజు	డీఎస్‌బీ, కర్నూలు	సి.బెళగల్
మహబూబ్ బాషా	ఆలూరు	వీఆర్, కర్నూలు
జే.మన్మథ విజయ్	డీటీసీ, కర్నూలు	ఆలూరు
ఎం.తిమ్మారెడ్డి	కర్నూలు వన్‌టౌన్	నందవరం
డి.మహేష్‌కుమార్	పెద్ద తుంబళం	ఇస్వి పీఎస్
బి.మల్లికార్జున	కర్నూలు టూటౌన్	పెద్ద తుంబళం
ఏ.దేవదాస్(ఆర్‌పీఎస్ఐ)	ఆదోని త్రీటౌన్	వీఆర్, కర్నూలు
ఎం.మహేంద్ర (ఆర్‌పీఎస్ఐ)	వీఆర్, కర్నూలు	వీసీఆర్, ఆదోని
ఎం.రామదాస్	వీఆర్, కర్నూలు	పత్తికొండ

నిందితుడికి మూడేళ్ల జైలు

ఆత్మకూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయంలో దొంగతనానికి పాల్పడ్డ దొంగ షేక్ మహబూబ్‌బాషాకు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రాహుల్ అంబేద్కర్ మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ వెంకట నారాయణరెడ్డి గురువారం తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్ శివాలయంలో 19-5-2024 వ తేదీ రాత్రి ఓ గుర్తు తెలియని దొంగ గుడి తలుపులు పగులగొట్టాడు. హుండీలోని నగదు రూ.17,000లు సుమారు 2తులా వెండి ఆభరణాలు దొంగతనం అయినట్లు గుడి అర్చకుడు మధుసూదనశర్మ ఫిర్యాదు చేశారు. అప్పట్లో పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో షేక్ మహబూబ్‌బాషాను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.9000 నగదు, 2 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరు, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లోని చేసిన పలు దొంగతనాల కేసుల్లో కూడా మహబూబ్‌బాషా నిందితుడు కావడంతో అప్పట్లో కోర్టులో హాజరు పరచడంతో జడ్జి రిమాండ్‌కు ఆదేశించారు. ఇప్పటి వరకు రిమాండ్‌లో ఉన్న అతడిని గురువారం సదరు కేసుల్లో మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ వివరించారు.

ట్రాక్టర్ కింద పడి హమాలీ మృతి

నంద్యాల టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డులో ట్రాక్టర్ కింద పడి హమాలీ మృతి చెందిన ఘటన గురువారం నంద్యాలలో జరిగింది. ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా తెలిపిన వివరాలివీ.. నంద్యాల పట్టణం ఆర్ఎస్ నగర్‌కు చెందిన హమాలీ దేవసహాయం(60) గురువారం మార్కెట్ యార్డులో ట్రాక్టర్‌లో వెళ్తూ టర్నింగ్ వద్ద డ్రైవర్ ట్రాక్టర్‌ను తిప్పినప్పుడు ట్రాలీలో ఉన్న దేవసహాయం ట్రాక్టర్ వెనుక టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. దేవసహాయం కొన్నేళ్లుగా హమాలీగా పని చేస్తున్నారు. రేషన్ పంపిణీకి సంబంధించిన ట్రాక్టర్‌లో వెళ్తూ ఘటన జరిగింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

- నంద్యాల మార్కెట్‌యార్డులో గురువారం ట్రాక్టర్ కింద పడి చనిపోయిన హమాలీ దేవసహాయం కుటుంబ సభ్యులను మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు రూ.5వేలు అందజేశారు.

రెండో రోజు గాలింపు

- బైకు లభ్యం.. దొరకని వ్యక్తి ఆచూకీ



భవనాశి వాగులో గాలిస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు

పాములపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పాములపాడు గ్రామ శివార్లలోని భవనాశివాగులో గల్లంతైన నాగేశ్వరరావు కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు.. బుధవారం కొత్తపల్లి మండలం నాగంపల్లి గ్రామానికి చెందిన జెల్లె నాగేశ్వరరావు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుపై మోటారు సైకిల్‌పై వెళ్తూ కొట్టుకుపోయారు. ఎస్ఐ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం చీకటి పడే వరకు బోట్ల ద్వారా గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపారు. బైకు లభించింది. అయితే వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ సుభద్రమ్మ పర్యవేక్షించారు.

మహిళ ఆత్మహత్య

- పక్కింటి వారి వేధింపులే కారణమని కూతుళ్ల ఆరోపణ

కోడుమూరు రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుగొండ గ్రామంలో మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పక్కింటి వారి వేధింపులే కారణమని కూతుళ్లు మహేశ్వరి, ఈరమ్మ ఆరోపించారు. బాధితుల కథనం మేరకు.. ఉప్పరి సుంకులమ్మ(50)కు భర్త లేడు. ఇద్దరు కూతుళ్లకు వివాహం చేసి, ప్రస్తుతం ఒంటరిగా నివసిస్తోంది. ఇంటిపక్కన ఉన్న మిన్నమ్మ కుటుంబం సుంకులమ్మతో తరచూ వ్యర్థపునీటి విషయంలో గొడవలు పడేవారు. ప్లేటు కడిగిన నీళ్లు తమ ఇంటిముందుకు వచ్చాయన్న కోపంతో మిన్నమ్మ కుటుంబం మృతురాలిపై దాడి చేసి, అవమానించారు. దీంతో మనస్తాపం చెందిన సుంకులమ్మ గురువారం ఇంట్లో గడ్డిమందు తాగింది. పనులకు పిలిచేందుకు వెళ్లిన సహ కూలీలు గమనించి ఇరుగుపొరుగు సాయంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోలుకోలేక సాయంత్రం మృతి చెందింది. ఇంటిపక్కన ఉన్న మిన్నమ్మ, కొడుకు శంకర్, కోడలు జయలక్ష్మి దాడిచేయడంతోనే తమ తల్లి చనిపోయిందని కూతుళ్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళపై దాడి కేసులో జైలు, జరిమానా

కర్నూలు లీగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): హాలహర్వి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళపై దాడి చేసిన కేసులో ఇద్దరు నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కర్నూలు ఏడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి లక్ష్మిరాజ్యం గురువారం తీర్పు చెప్పారు. హాలహర్వికి చెందిన ఫిర్యాది జయలక్ష్మికి అదే గ్రామానికి చెందిన నిందితులు మంగళి రంగన్న, అతని భార్య మంగళి ఈరమ్మ మధ్య డబ్బు విషయంలో మనస్పర్థలు ఉండేవి. ఈ విషయంపై 2017 మార్చి 25వ తేదీన నిందితులు ఫిర్యాది జయలక్ష్మి ఇంట్లోకి వెళ్లి దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ కృష్ణమూర్తి నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి ఐదు సంవత్సరాల జైలు, రూ.15వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున ఇన్‌చార్జి పీపీ సరళాదేవి వాదించారు.

కారు దొంగల అరెస్టు

- పది నెలల తరువాత ఛేదించిన పోలీసులు



ఇన్నోవా కారుతో పోలీసులు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో జనవరిలో నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఇన్నోవా క్రిష్టా కారు ఎత్తుకెళ్ళిన దొంగలను ఎమ్మిగనూరు పట్టణ పోలీసులు గురవారం ఆరెస్టు చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు... జనవరి 15వ తేది నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా గోనెగండ్ల మండలం, హెచ్ కైరవాడి గ్రామానికి చెందిన అంజనేయులు (44) ఇన్నోవా క్రిష్టా కారును పార్కింగ్‌చేసి స్వామి దర్శన నిమిత్తం వెళ్లారు. ఇదే అదనుగా మహారాష్ట్ర దొంగల ముఠా కారును దొంగిలించారు. అంజనేయులు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎట్టకేలకు పది నెలల తరువాత రెండు రోజుల క్రితం మహారాష్ట్రలో ఉన్న దొంగల ముఠాను ఆరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచగా నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. దొంగల ముఠాను ఆరెస్ట్ చేయడానికి సీసీటీవీలు, కర్ణాటక, మహారాష్ట్ర పోలీసుల సమన్వయంతో మహారాష్ట్ర బీడ్ జిల్లాకు చెందిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారు ఎ1 విఠల్ సాకారం లష్కరే, ఎ2 పరశురాం మోహన్ గైక్వాడ్, ఎ3-భీమ్ రావు సహదేవ్, ఎ4 రాజు గైక్వాడ్, ఎ5-అనిల్ జాదవ్, ఎ6- జ్ఞానేశ్వర్ జాదవ్ అని తెలిపారు. దొంగల ముఠా అక్కడ స్థానికులతో పోలీసులపై ప్రతి దాడులకు దిగగా, చాకచక్యంగా వ్యవహరించి ఆరెస్ట్ చేశామని తెలిపారు. ఈ కేసు విషయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ భార్గవి మహారాష్ట్ర పోలీసులను సమన్వయ పరుస్తూ తమకు సహకరించారన్నారు.

రీ వాల్యుయేషన్‌లో వివాదం



- ఆర్‌యూలో కాంట్రాక్టు ఉద్యోగి పెత్తనం
- ఆందోళనలో ప్రొఫెసర్లు, ఉద్యోగులు
- విద్యార్థి నేతల చేతుల్లోకి వర్సిటీ కీలక ఫైళ్లు

కర్నూలు అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎంవో పేషీ పేరుతో ఓ కాంట్రాక్టు ఉద్యోగి రాయలసీమ యూనివర్సిటీలో చేస్తున్న కొందరు ప్రొఫెసర్లు జీర్ణించుకోలేక ఆందోళన పరీక్షల ఫలితాలు దేశమంతా ఆన్‌లైన్ ప్రక్రియ సాగుతుండగా.. రాయలసీమ వర్సిటీలోని కొందరు ఆ ప్రక్రియను కూడా తమ చేతుల్లోకి తీసుకోవడం చర్చనీయాంశమైంది. తాజాగా బుధవారం బీఈడీ 3వ సెమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్86 శాతం ఉత్తీర్ణత ఫలితాలు విడుదల చేసింది. పరీక్షల విభాగం కంట్రోలర్‌ను కట్టడి చేసే క్రమంలో ఫలితాల విడుదల ప్రక్రియ అంతా ఓ ఇన్‌చార్జి అధికారి చేతుల్లోకి వెళ్లిందని కొందరు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగి, ఇన్‌చార్జి అధికారి రీ వాల్యుయేషన్ ఫీజు మొదటిసారిగా రూ.300 నుంచి రూ.550కు పెంచడంతో వర్శిటీకి రూ.పది లక్షల ఆదాయం సమకూర్చామని ఉపకులపతిని పక్కదారి పట్టించారనే ప్రచారం జరుగుతోంది. తెరవెనుక కళాశాలల యాజమాన్యాలతో లోపాయికారీ ఒప్పందంతో విద్యార్థులను పాస్ చేయించుకున్నారనే ప్రచారం క్యాంపస్‌లో చక్కర్లు కొడుతోంది. మే నెలలో జరిగిన బీఈడీ పరీక్షల్లో చాలా మందిని కావాలనే ఫెయిల్ చేశారా? అనే సందేహంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. 1098 మంది రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోగా 955 మంది ఉత్తీర్ణులు కావడం వెనుక పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. యూనివర్సిటీలో ఉద్యోగుల నియామక డాక్యుమెంట్లు బైటికి వెళుతున్నాయని, వాటిని విద్యార్థి నాయకులకు అందించి, ఉపకులపతి ద్వారా చర్యలకు వీరే ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఉద్యోగ నియామక పత్రం బయటకు ఎలా వెళ్లిందని పరిపాలన అధికారి వద్ద ఉద్యోగులు ప్రస్తావించగా సదరు అధికారి హేళనగా మాట్లాడటం అధ్యాపకులు జీర్ణించుకోలేకపోతున్నట్లు సమాచారం.

రీ వాల్యుయేషన్‌లో ఉత్తీర్ణతపై అనుమానాలున్నాయి



బీఈడీ 3వ సెమిస్టర్ రీవాల్యుయేషన్‌లో ఒక్కసారిగా 995 మంది ఉత్తీర్ణత సాధించడం అనుమానంగా ఉంది. కావాలనే ఫెయిల్ చేసి అటు బీఈడీ కళాశాలల యాజమాన్యాలతో కొందరు కోటరి ఉద్యోగులు వసూళ్ల పర్వానికి తెగబడ్డరనే ప్రచారం ఉంది. ఈ విషయంలో నిగ్గు తేలే వరకు పోరాటం చేస్తాం. ఓ కాంట్రాక్టు ఉద్యోగి తరచూ సీఎం పేషీ పేరు చెప్పుకొని దోపిడీ చేస్తున్నాడని వినికిడి. దీన్ని అడ్డుకోడానికి ఆందోళనలకు దిగుతాం. ఇకనైన ఉపకులపతి స్పందించి వర్శిటీని గాడిలో పెట్టాలి. **- ఎస్. శరత్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్**

విషయం నా దృష్టికి వచ్చింది



ఉద్యోగుల నియామకాల హార్డు కాపీలు బయటకు వెళ్లడం సరికాదు. ఇది ఎలా జరిగిందో విచారించి చర్యలు తీసుకుంటా. పరీక్షల విభాగంలో అంతా ఆన్ లైన్‌పద్ధతిని ప్రవేశపెట్టబోతున్నాం. ఇకపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తా. **- వి. వెంకట బసవరావు, ఉపకులపతి ఆర్‌యూ**

కర్ణాటక ఎక్సైజ్ శాఖ తీరుపై అధ్యయనం

కర్నూలు అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఆర్. వెంకటేష్ కుమార్‌ను గురువారం బెంగళూరు కమిషనర్ కార్యాలయంలో జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి, సూపరింటెండెంట్ ఎం.సుధీర్ బాబు కలిశారు. కర్ణాటక ఎక్సైజ్ పనితీరుపై ప్రభుత్వం అధ్యయనానికి బృందాలను పంపింది. మద్యం అమ్మకాలు, సరఫరా, డిపోల పనితీరు, డిస్టిల్లరీలు, సరఫరా, నియంత్రణ, విధానంలో చేపడుతున్న విధానాలతో పాటు క్యూఆర్ కోడ్ పని తీరు, ఆ రాష్ట్రంలో అమలు అవుతున్న ఎక్సైజ్ సేవలపై ఆరాతీసినట్లు సమాచారం. స్కానింగ్, డిజిటల్ పేమెంట్, తదిర అంశాలపై పరిశీలించినట్లు తెలిసింది. అక్కడి ఎక్సైజ్ శాఖ చేపడుతున్న కార్యకపాలను నివేదికల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఎక్సైజ్ వర్గాలు వెల్లడించాయి. వీరి వెంట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాజేంద్ర ప్రసాద్ వెళ్లారు.



కర్ణాటక ఎక్సైజ్ కమిషనర్‌ను కలిసిన డీసీ, సూపరింటెండెంట్

సమాన విద్యావకాశాలు కల్పించాలి

- యూఎస్ఎఫ్ఐ జాతీయ సలహాదారు అరుణ్‌కుమార్



భగత్ సింగ్‌కు నివాళి అర్పిస్తున్న అరుణ్‌కుమార్

కర్నూలు న్యూసిటీ/ఎడ్యుకేషన్ అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దేశంలో అందరికీ సమానమైన విద్యావకాశాలు కల్పించాలని యూఎస్ఎఫ్ఐ జాతీయ సలహాదారు మాడిశెట్టి అరుణ్‌కుమార్ అన్నారు. గురువారం యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ప్రారంభమైంది. అతిథిగా జాతీయ ఉపాధ్యక్షుడు తాటికొండ రవి, రాష్ట్ర కార్యదర్శి సందెపోగు ఉదయ్‌కుమార్ హాజరయ్యారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యావ్యతిరేక విధానాలను చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వైద్యకళాశాలను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన సరికాదన్నారు. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సుమారు రూ.5600 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఏఐసీటీయూ రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, యూవైఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ గణేష్‌బాబు, ఇతర సంఘాల నాయకులు కృష్ణ, బసవయ్య, జాన్‌బాబు, హరి, పవన్, ఆర్యన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును తనిఖీ చేసిన న్యాయాధికారి

నంద్యాల క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సబ్ జైలును గురువారం మూడో అదనపు జిల్లా న్యాయాధికారి, లోక్ అదాలత్ చైర్మన్ అమ్మన్న రాజా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడుతూ సబ్ జైలులో అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. జైలు గదులు, పరిసరాలను, వంటశాలలను, స్నానపు గదులను పరిశీలించారు. ఖైదీల ఆరోగ్య విషయాలు, వారి కుటుంబ సభ్యుల గురించి ఆరా తీశారు. క్షణికావేశంలో చేసిన తప్పులవల్ల కుటుంబసభ్యులు బాధపడాల్సి వస్తుందని, శిక్ష అనంతరం సత్ప్రవర్తనతో సమాజంలో మెలగాలని ఖైదీలకు జడ్జి సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ గురుప్రసాద్‌రెడ్డి, లోక్‌అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు వసతి

- గదుల నిర్మాణానికి టీటీడీ సానుకూలం
- శ్రీశైలం దేవస్థానం చైర్మన్ రమేశ్ నాయుడు

శ్రీశైలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సామాన్య భక్తులకు వసతి కల్పించడం కోసం గదుల నిర్మాణానికి టీటీడీ ఈవో అనిల్ సింఘాల్ సానుకూలంగా స్పందించారని శ్రీశైలం దేవస్థానం చైర్మన్ రమేశ్ నాయుడు తెలిపారు. గురువారం ఉదయం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనంలో ఈవోను కలిసి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం శ్రీశైల క్షేత్రానికి రోజురోజుకు పెరుగుతున్న భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రధానంగా వసతి గదుల అవసరం గురించి వివరించారు. టీటీడీ ఆధ్వర్యంలో వివిధ కెటగిరీలలో వసతి గదులతో పాటు దోర్నాలలో డార్మిటరీలు, ప్రధాన కూడళ్లలో శౌచాలయాలు వంటి నిర్మాణాలను వినతి పత్రం అందించారు. శ్రీశైల క్షేత్రంలో టీటీడీ తరఫున వసతి సముదాయాల నిర్మాణం కోసం పాలక మండలి సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డిని పది రోజులలో శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించి నివేదిక సిద్ధం చేయాలని టీటీడీ ఈవో సూచించారన్నారు.



ఈవో అనిల్ సింఘాల్‌కు వినతి పత్రం ఇస్తున్న ఈవో

మహిళలకు ఉచిత శిక్షణ

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జనరల్ డ్యూటీ, అసిస్టెంట్ ట్రైనీ, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సుల్లో మహిళలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు మహిళా ప్రాంగణం డీఎం అంజనీ భూషణ్ ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ సహకారంతో డేస్కాలర్, రెసిడెన్షియల్‌లో 60 రోజుల శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగలవారు. కర్నూలు ప్రాంతీయ కంటివైద్యశాల పక్కన మహిళా ప్రాంగణంలో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి విశ్వశాంతి మహాయాగం



యాగశాల దగ్గర స్వామిజీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

- కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి

ఎమ్మిగనూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో శుక్రవారం నుంచి 87వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవాలు జరగనున్నాయి. ఇందుకోసం ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. 13 రోజుల పాటు జరిగే ఈ మహాయాగం శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆధ్వర్యంలో జరగనుంది. మహాయాగంలో ప్రధానంగా విష్ణు పంచాయతనం, ఆయుత చండీ, అతి రుద్ర, సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం, చతుర్వేద పూర్వక మహా గణపతి, మహాసౌర, సుదర్శన, లక్ష్మినారాయణ సహిత శ్రీమద్భాగవత 87వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవాలు జరుగుతాయి. వీవర్స్ కాలనీ మైదానంలో రెండు నెలలుగా యాగశాల నిర్మాణ పనులు కొనసాగాయి. మైదానంలో మూడు ప్రధాన యాగశాలలను ఏర్పాటు చేశారు. యాగశాలలన్ని కర్రలో నిర్మించటంతో పాటు పైభాగంలో తాటాకులతో నిర్మించారు. ఒక్కో యాగశాలలో 12 హోమగుండాలు మూడు యాగశాలలో 36 హోమగుండాలు నిర్మించారు. మధ్యలో స్వామీజీ, పండితులు ఉండేందుకు కట్టను నిర్మించారు. రోజు మూడు యాగశాలలో దాదాపు 360 మంది భక్తులు హోమాల్లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే పండితులు, హోమంలో పాల్గొనే భక్తులు, హోమాలను తిలకించేందుకు వచ్చే ప్రజలకు భారీగా విడిది షెడ్లను ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో దేవతామూర్తుల కటౌట్లను, పట్టణంలో ప్రధాన రహదారుల్లోను, ప్రధాన కూడల్లోను విద్యుత్ దీపాలతో స్వాగతతోరణాలు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం అల్పాహారం, మధ్యాహ్నం భోజన వసతితో పాటు రాత్రి అల్పాహారాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మహాయాగశాల ఏర్పాట్లలో పట్టణానికి చెందిన తాపీ కార్మికులు, వడ్డెరులు ఉచితంగా పనుల్లో పాల్గొంటున్నారు. అలాగే విశ్వహిందు పరిషత్ సభ్యులు కూడా ఏర్పాట్లలో సహాయ సహకారాలు అందిస్తున్నారు.

భక్తుల సహకారంతోనే...

భక్తుల సహకారంతోనే ఎమ్మిగనూరు పట్టణంలో 87వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం నిర్వహిస్తున్నాం. మహాగణపతి పూజతో మహాయాగం ప్రారంభం అవుతుంది. 15 రోజుల పాటు వివిధ రకాల హోమాలు నిర్వహిస్తాం. మహాయాగం నిర్వహించడం వల్ల తుఫాన్లు, సునామీలు, అకాల వర్షాల వంటి విపత్తులు రాకుండా ఈ హోమాలు ఉపకరిస్తాయి. భక్తులకు కూడా మంచి జరుగుతుంది. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సహకరిస్తున్నారు. **- కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ, శ్రీకృష్ణపీఠాధిపతి**

ఎమ్మిగనూరు ప్రజల అదృష్టం

ఎమ్మిగనూరు గడ్డపై విశ్వశాంతి మహాయాగం జరగడం ఇక్కడి ప్రజలు చేసుకున్న అదృష్టం. ఇంతపెద్ద యాగంతో ఎమ్మిగనూరు ఎంతగానో అభివృద్ధి చెందుతుంది. ప్రాచీన యుగం నుంచి యాగాలతో ఎంతో మంచి జరుగుతుందనే అందరికి తెలిసిన విషయమే. అలాటి ఈ ప్రతి ఒక్కరు సహకరించాలి. శ్రీకృష్ణ పీఠాధిపతులు శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ సంకల్పించిన ఈ యాగం జయప్రదం కావాలని కోరుకుంటున్నా. **- బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మిగనూరు**

పంట నష్టం వివరాల సేకరణ

నందికొట్కూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దెబ్బకు జూపాడు బంగ్లా, నందికొట్కూరు మండలాల్లో నష్టపోయిన పంటలను వ్యవసాయశాఖ అధికారులు లెక్కిస్తున్నారు. గురువారం రెండు మండలాల్లో వర్షం దెబ్బకు నష్టపోయిన వివిధ రకాల పంటల వివరాలను సేకరించినట్లు ఏడీఏ గిరీష్ తెలిపారు. నందికొట్కూరులో 762మంది రైతులు 733 హెక్టార్లలో వేసిన మొక్కజొన్న, సోయాబిన్, జూపాడుబంగ్లాలో 979 మంది రైతులు 1268 హెక్టార్లలో వేసిన మొక్కజొన్న, వరి, పత్తి నష్టం వాటిల్లిందని ఏడీఏ తెలిపారు.

రోడ్డును మరమ్మతు చేయండి

నందికొట్కూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి దేవాలయానికి వెళ్లే రోడ్డును వెంటనే మరమ్మతులు చేయాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆరోడ్డును మున్సిపల్ కమిషనర్ బేబితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దాసి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ అయ్యప్పస్వామి దేవాలయానికి వెళ్లే రోడ్డు దెబ్బతినడంతో మాలాధారులు, భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

కొత్తపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో మేరీ సూచించారు. గురువారం మండలంలోని గువ్వలకుంట్ల, జీ.వీరాపురం గ్రామాల్లో ఆమె పర్యటించి గ్రామస్థులకు సూచనలు చేశారు. మురుగు, వర్షం నీరుఉన్న చోట్ల స్వచ్ఛభారత్ కార్మికులతో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. డిప్యూటీ ఎంపీడీవో సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

2న కబడ్డీ జట్ల ఎంపిక

పాణ్యం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ ఎంపిక నవంబరు 2వ తేదీన జరుగుతుందని ఎంఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక విజయానికేతన్ పాఠశాలలో ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. కబడ్డీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు బర్త్, ఆధార్ సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలన్నారు.

రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

గోస్పాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులు తమపేర్లను రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఏవో స్వప్నిక, తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ తెలిపారు. గురువారం గోస్పాడు, పసురపాడు, ఒంటి వెలగల, తేళ్లపురి గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంటలు నష్టపోయిన రైతుల వివరాలు జిల్లా అధికారులకు నివేదిక పంపుతామని వారు తెలిపారు.

అధిక వర్షాలకు 35 గొర్రెలు మృతి

కొత్తపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలోని కొత్తమాడుగుల సమీపంలో అటవి ప్లాంటేషన్ ప్రాంతంలో జడ్‌వారిపల్లె, ఎదురుపాడు గ్రామాలకు చెందిన రైతుల గొర్రెలు మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎదురుపాడు చెందిన బెండేపు వెంకటేశ్వర్లుకు చెందిన మేకలు 2, ప్రపసాద్‌బాబు 1, కే.శేషన్న 1, స్వామి 1గొర్రె, జడ్‌వరిపల్లె మధుకిషోర్ 4మేకలు, లింగస్వామి 10, జి.బలరాముడు 8, పరుశురాముడు4, రంగస్వామి4, మొత్తం 35 గొర్రెలు మృతి చెందాయి.

పంటలను పరిశీలించిన ఆర్డీవో

పాములపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను ఆర్డీవో నాగజ్యోతి పరిశీలించారు. గురువారం రుద్రవరం, పాములపాడు గ్రామాల్లో నేలకొరిగిన వరి, మొక్కజొన్న, పత్తి పంటలను మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మండలంలో దాదాపు ఆరువేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా అన్నారు. వీఆర్‌వో శివన్న సిబ్బంది పాల్గొన్నారు.

రైతులెవరూ భయపడొద్దు

నంద్యాల రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని, రైతులెవరూ భయపడొద్దు అని నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు అన్నారు. గురువారం మండలంలోని కానాల గ్రామంలో ఆర్డీవో చల్లా విశ్వనాథ్, తహసీల్దార్ శ్రీవాణి, ఏవో ప్రసాద్‌రావుతో కలిసి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పంట నష్టాన్ని త్వరగా అంచనా వేయాలన్నారు. పంటనష్టం అంచనా వేగవంతం చేయాలని అధికారులను ఆర్డీవో చల్లా విశ్వనాథ్ ఆదేశించారు. రైతులకు ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. నంద్యాల డివిజన్ పరిధిలో 9 మండలాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. శిరివెళ్ల లో వరి పంటకు అధిక నష్టం జరిగిందన్నారు. కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చి ఆదుకోవాలని తహసీల్దార్ శ్రీవాణిని రైతులు వేడుకున్నారు. న్యాయం చేస్తామని ఆమె హామీఇచ్చారు.

షాపుల కేటాయింపు సమంజసం కాదు

శ్రీశైలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల దేవస్థానంలో అన్యమతస్థులకు షాపులు కేటాయించడం సమంజసం కాదని శ్రీశైలం విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి కాశయ్య అన్నారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో డిప్యూటీ రమణమ్మను కలిసి వినతిపత్రం అందించారు. నాగరాజు, బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు మెంకటేశ్వర్లు, రామకృష్ణ, ఆనంద్, మల్లికార్జునలు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

- నోటీసు లేకుండా భూమి కొలవడానికి అధికారులు వచ్చారని..

గోనెగండ్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల కింద కొన్న భూమిని కొలవడానికి అధికారులు ముందుస్తు నోటీసు లేకుండా రావడంతో కందనాతి సలామ్ అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం సాయంకాలం జరిగింది. గత కొనేళ్ల క్రితం చిన్నమాదన్న భూమిని కందనాతి సలాం కుటుంబసభ్యులు కొన్నారు. అయితే స్థలం కొన్నదానికంటే ఎక్కువగా ఉందని భూమిని కొలవాలని చిన్నమాదన్న కుటుంబసభ్యులు రెవెన్యూ అధికారులను కోరుతున్నారు. ఆ వివాదం ఆరేళ్లుగా కొనసాగుతోంది. గురువారం సాయంత్రం చిన్నమాదన్న, పెద్దమాదన్నతో పాటు మరో వ్యక్తి, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు కలసి భూమిని కొలవడానికి వెళ్లారు.

తనకు ముందస్తు సమాచారం లేకుండా భూమి కొలిచేందుకు వచ్చారంటూ కందనాతి సలాం అడ్డుపడ్డాడు. అయి నప్పటికీ అధికారులు, చిన్నమాదన్న కుటుంబసభ్యులు భూమిని కొలిచేందుకు సిద్ధమయ్యారు. దీంతో సలాం పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం సలాంను ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. వారు చిన్నమాదన్న కుటుంబసభ్యులపై ఫిర్యాదు చేశారు. సలాం, ఆయన కుటుంబసభ్యులు సర్వే పనులను అడ్డుకున్నారని రెవెన్యూ, సర్వే సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల వారి ఫిర్యాదులను స్వీకరించి విచారణ చేస్తున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు.

మొక్కలతో సమాజానికి ఆరోగ్యం

కర్నూలు అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జి.శ్రీనివాస్ అన్నారు. గురువారం క్లస్టర్ యూనివర్సిటీ మైదానంలో సిల్వర్ జూబ్లీ కళాశాల, ఎన్‌సీసీ 9ఏ బాలికల బెటాలియన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎస్‌బీఐ మేనేజర్ గడ్డం రాజేష్ కుమార్, బీఆర్ ప్రసాదరెడ్డి, ఎల్లాకృష్ణ, హనుమంతు, రవి, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న సిబ్బంది

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● పత్తి కొనుగోలు ప్రారంభించిన ఎమ్మెల్యే


పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం గూడూరు మండలం పెంచికలపాడు వద్ద జిన్నింగ్ మిల్‌లో పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. రైతులు ముందుగా సమీప రైతుసేవా కేంద్రాల్లోని ఈ మార్కెట్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకొని మార్కెట్‌కు తెవాలన్నారు. తేమ 8శాతం లోపుంటే క్వింటం రూ.8,110 వస్తుందన్నారు. కోడుమూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకెపోగు సుగుణమ్మ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆకెపోగు జయన్న, గోపాల్ రెడ్డి, ఎంపీటీసీ మద్దిలేటి, కర్ణం చిన్న గిడ్డయ్య పాల్గొన్నారు.

గృహాలను త్వరగా నిర్మించుకోవాలి


కన్నమడకలలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

ఓర్వకల్లు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు గృహ నిర్మాణాలను త్వరగా పూర్తిచేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరమణ సూచించారు. గురువారం కన్నమడకల గ్రామంలో గృహాలను పరిశీలించారు. ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రేషన్‌కార్డు, పొజిషన్ సర్టిఫికేట్, కులం, ఆదాయ ధృవీకరణ పత్రాలు, జాబ్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ కాలపీలను జతచేసి మండల హౌసింగ్ కార్యాలయంలో అందజేయాలన్నారు. రూ.1.20లక్షలు మంజూరు చేసిందని, ఉపాధి పథకం ద్వారా 90 పని దినాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.12వేలను ప్రభుత్వం ఇస్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

'పురమిత్ర యాప్'లో నగర పాలక సేవలు

● నగర పాలక కమిషనర్ విశ్వనాథ్



కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పురమిత్ర యాప్'తో నగరపాలక సేవలు సుళువుగా పొందవచ్చని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. గురువారం మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు, ఇళ్లలో చెత్త సేకరణ, ఇంటి పన్నుల చెల్లింపు, ప్రజారోగ్యం, దోమలు, కుక్కల బెడద, రహదారులపూ గుంతలతో సహా 119 రకాల సేవలు పురమిత్ర యాప్‌లో అందుబాటులో ఉన్నాయనాన్నరు. యాప్‌ను ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఫిర్యాదులను టెక్స్ లేదా వాయిస్ రూపంలో పంపవచ్చన్నారు. సమస్యను ఫోటో తీసి జతచేస్తే ఏఐ సాంకేతికత ద్వారా సంబంధిత అధికారికి చేరుతుందని కమిషనర్ తెలిపారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

ఓర్వకల్లు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో మోడల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని షాహీదా సమరీన్ ప్రతిభ కనబరచినట్లు ఎంఈవో ఓంకార్ యాదవ్ తెలిపారు. గురువారం మాట్లాడుతూ పాణ్యం నియోజవర్గం నంచి నాలుగు మండలాలకు చెందిన 12 మంది విద్యార్థులు పాల్గొనగా షాహీదా సమరీన్ ప్రతిభ చూపి, నవంబరు 26న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీలో పాల్గొనే అవకాశం పొందిందన్నారు.


షాహీదా సమరీన్

సారూ.. ఇదేం తీరు?

● దేవనగర్‌లో బీటీ రోడ్డుపై సీసీ రోడ్డు నిర్మాణం
● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



బీటీ రోడ్డుపై సీసీ రోడ్డు నిర్మాణం, ఇన్‌సెట్‌లో ఇళ్లవద్ద అడ్డంగా వేసిన కంకర

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగర పాలక అధికారులు తీరుతో ప్రజా ధనం వృథా అవుతోంది. నగరంలోని దేవనగర్‌లో ఇప్పటికే ఉన్న బీటీ రోడ్డుపై అధికారులు సీసీ రోడ్డు నిర్మిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. దేవనగర్ సత్యనారాయణ స్వామి ఆలయం నుంచి విఠల్‌నగర్ రైల్వే గేటు వరకు రూ.1.50కోట్లతో సీసీ రోడ్డును నిర్మిస్తున్నారు. కాగా ఈ పనులు గత వైసీపీ (హయాంలో మంజూరైనట్లు కొందరు అంటుండగా, టీడీపీ ప్రభుత్వం వచ్చాక నిలిపేంది. అయినా మరలా పనులు మొదలవడంతో ఇదేం పద్ధతని విమర్శలు వస్తున్నాయి.

స్థానికులు, వాహనదారుల అవస్థలు

పనుల కోసం రోడ్డుకు అడ్డంగా కంకర వేయడంతో స్థానికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. తమ గృహాల ముందు తవ్వేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీటీ రోడ్డుకు మరమ్మతులు చేస్తే సరిపోయేదానికి ఇలా రూ.కోట్లు వృథా చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం

దేవనగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు నా దృష్టికి వచ్చింది. పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటాము. ప్రస్తుతానికి పనులు ఆపేయాలని అధికారులను ఆదేశించా. **- పి.విశ్వనాథ్, కమిషనర్**


రోడ్డుపై చేపలు పడుతూ నిరసన తెలుపుతున్న స్థానికులు

విష్ణుటౌన్‌షిప్‌లో సీసీ రోడ్డు నిర్మించాలి

నగర పాలిక పరిధిలోని విష్ణు టౌన్‌షిప్‌లో సీసీ రోడ్డు నిర్మించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం సభ్యుడు పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కాలనీ ప్రజలు, కమిటీ సభ్యులతో కలిసి ప్రధాన రోడ్డుపై చేపలు పడుతూ నిరసన తెలిపారు. వేసిన చోటే మళ్లీ వేస్తున్న అధికారులకు విష్ణు టౌన్‌షిప్‌లో సీసీ రోడ్డు లేకపోవం కనిపించలేదా అని ప్రశ్నించారు. కాలనీల నుంచి కార్పొరేషన్‌కు రూ. కోటికి పైగా ఆదాయం వస్తున్నా రోడ్డు వేయాలన్న ఆలోచన రాకపోవడం దారుణమన్నారు. ఆర్.చంద్రశేఖర్, ఎం.ఆజాద్, కే.మల్లికార్జున, ఎస్.హైదర్, మహ్మద్ యూనుస్, ముస్తఫా ఉన్నారు.

ముంచిన తుఫాను

● ఓర్వకల్లు మండలంలో నీట మునిగిన పొలాలు

ఓర్వకల్లు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అసలే తెగుళ్లతో సతమతమవుతున్న పంటలను ఇటీవల కురిసిన తుఫాన్ మొత్తంగా ధ్వంసం చేసింది. మొంథా తుఫాన్ దెబ్బతో పొలాల్లో వర్షం నీరు నిల్వ ఉండటంతో పంటలు కుళ్లిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని హుశేనాపురం, ఓర్వకల్లు, కన్నమడకల, నన్నూరు, పూడిచెర్ల, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, గుట్టపాడు, సోమయాజులపల్లె తదితర గ్రామాల్లో పత్తి, మొక్కజొన్న, పొగాకు, కంది, టమోటా 4,500 ఎకరాల్లో సాగు చేశారు. ఓవైపు తెగుళ్లు, మరోపక్క భారీ వర్షాలతో పంటలు మునిగి మొక్కలు కుళ్లిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే.. 15 రోజుల క్రితం వేసిన పప్పు శనగ పంట మొలకెత్తింది.


గుట్టపాడులో నీటమునిగిన పత్తి పంట

యాజమాన్య పద్ధతులు పాటించాలి



యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటను కాపాడుకోవచ్చు. వర్షపు నీటిని తొలగించాక ఎకరాకు 25 నుంచి 30 కిలోల యూరియా లేదా 10-15 కిలోల న్యూరేట్ ఆఫ్ పొటాష్ పిచికారీ చేయాలని. అధిక వర్షాలతో పైరులో మెగ్నీషియం లోపంతో ఆకులు ఎండిపోతాయి. మెగ్నీషియం సల్ఫేట్ లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి 7 నుంచి 10 రోజుల వ్యవధిలో పైరుపై పిచికారి చేయాలి. పత్తిలో కాయకుళ్లు, ఆకుమచ్చ తెగులు నివారణకు 3 గ్రా. కాపర్, యాక్సీ ప్లోరైడ్‌ను లీటరు నీటి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. **- మధుమతి, ఏవో, ఓర్వకల్లు.**

రహదారి విస్తరణకు సహకరించండి

● మంత్రి టీజీ భరత్
● బాధిత యజమానులతో సమావేశం


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్ , అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట వంతెన వరకు రహదారి విస్తరణకు సహకరించాలని మంత్రి టీజీ భరత్ కోరారు. గురువారం ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సంస్థ సమావేశ భవనంలో కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి బాధితులతో సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ పెరుగుతుండటంతో రహదారిని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. రహదారి విస్తరణ ఏళ్లుగా పెండింగ్ ఉందని, బాధితులందరూ సహకరిస్తే పనులు పూర్తి చేస్తామన్నారు. మొత్తం 180పైగా ఆస్తులు విస్తరణలో ప్రభావితమవుతాయని, రహదారిని 50 అడుగుల మేర విస్తరించనున్నట్లు తెలిపారు. మొదటిదశలో 175 మీటర్ల వరకు విస్తరణ చేయనున్నామని, బాధితులకు ఆస్తి విలువకు నాలుగు రెట్లు విలువైన టీడీఆర్ బాండ్లు జారీ చేస్తామని, భవనాల నష్టం విషయంలో నష్టపరిహారం ఇస్తామన్నారు. అధికారులు అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని, నివృత్తి చేస్తారన్నారు. సీటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ డీసీపీ వెంకట రమణ, కార్పొరేటర్లు కురువ పరమేష్, క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాధతులకు వరం సీఎం సహాయనిధి..

ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న బాధితులకు సీఎం సహాయ నిధి ద్వారా వరమని మంత్రి టీజీ భరత్ అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో 5 మంది బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. అందజేశారు. చెలిమి అభినయ్ రూ.80.833, రంగమ్మకు రూ.1.20లక్షలు, పద్మావతికి రూ.12,300., జె.విలయమ్ కుమార్ రూ.30,541, ఆల్లూరి సరస్వతికి రూ.1.22లక్షల చెక్కులు అందించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ప్రజలకు కష్టాలు రాకుండా సీఎం చంద్రబాబు చూసుకుంటున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళుతున్నారని మంత్రి తెలిపారు.

జాబ్ మేళాను వినియోగించుకోవాలి

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కర్నూలు అర్బన్/కల్లూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సూచించారు. గురువారం నగరంలోని సాయి క్రిష్ణాడిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. కరస్పాండెంట్ పి.గోవర్ధన్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సి.రోసిరెడ్డి, జిల్లా ఉపాధికల్పనాధికారి పి.దీప్తి, స్కిల్ డెవలప్ మెంట్ అధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్‌లు, ప్రిన్సిపాల్, అడ్మిన్‌డైరెక్టర్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 509 మంది హాజరుకాగా, 196 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు.

● టీటీడీ, హిందూధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో గురువారం మాధవీనగర్ శివ రామాలయంలో ధార్మిక సప్తాహాన్ని ప్రారంభిం చారు. జి.శేషాచలం, డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, డా.మల్లు వేమారెడ్డి పాల్గొన్నారు.

నైతిక విలువలను పెంపొందించాలి

కర్నూలు క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నైతిక విలువలు పెంపొందించాలని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ పి.నరసింహరావు, డిప్యూటీ రీజనల్ హెడ్ అనంత కుమార్, విజిలెన్స్ ఆఫీసర్ జి.రాజశేఖర్ కోరారు. గురువారం నగరంలోని బిర్లా కాంపౌండు నుంచి కలెక్టరేట్ వరకు విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2025 ర్యాలీ నిర్వహించారు.


ర్యాలీలో పాల్గొన్నయూనియన్ బ్యాంక్ సిబ్బంది

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో రాణెమ్మ

సి. బెళగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రాణెమ్మ పంచాయతీ కార్యదర్శులను హెచ్చరించారు. గురువారం మండలంలోని శింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. కాలువలను శుభ్రం చేయించాలని, తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకుల వద్ద మురుగు నిలువకుండా చూడాలన్నారు. ట్యాంకులలో బ్లీచింగ్ పౌడర్ కలిపి కొళాయిలకు నీరు వదలాలన్నారు.

13న నాగార్జున సాగర్ రెసిడెన్షియల్ కాలేజీ స్వర్ణోత్సవాలు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ స్వర్ణోత్సవాలు ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా.పి.హరిచరణ్, జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డా.ఎం.కోటిరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పూర్వ విద్యార్థులు వందలాది మంది విద్యార్థులు అన్ని బ్యాచ్‌ల నుంచి 3వేల మంది ఒకే చోట కలుసుకుంటామన్నారు. పూర్వవిద్యార్థులంతా గోల్డెన్ జూబ్లీ వేడుకలకు హాజరు కావాలని ఆయన కోరారు.

సి.బెళగల్ ఎస్ఐగా వేణుగోపాల్‌రాజు

సి. బెళగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐగా వేణుగోపాల్ రాజును నియమిస్తూ కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు డీఎస్‌బీ నుంచి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న పరమేష్‌నాయక్‌ను కర్నూలు వీఆర్‌కు బదిలీ చేశారు.

గార్డులకు కొత్త వేతనాలు ఇవ్వాలి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు కొత్త వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. గురువారం ఏజెన్సీ ఈగల్ హంటర్ ఆపరేషన్ మేనేజర్ శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. కర్నూలు జీజీహెచ్, ఐ-హాస్పిటల్, మెడికల్ కాలేజీ, ఆదోని జీజీహెచ్, ఆలూరు, ఎమ్మిగనూరు పత్తికొండ, కోడుమూరు, వెల్దుర్తి హాస్పిటల్స్‌లో పని చేస్తున్న గార్డులకు జీవో.138 ప్రకారం రూ.18,600లు సూపర్‌వైజర్లకు రూ.21వేలు కనీస వేతనం ఇవ్వాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ వారంతపు సెలవులతో పాటు రెండు జతల యూనిఫాం, బూట్లు, బెల్టులు ఇవ్వాలన్నారు. స్పందించిన ప్రతినిధి శంకర్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు జి.ప్రణీత్, రాజు, సురేష్ పాల్గొన్నారు.


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

రాయపాటి శ్రీనివాస్‌కు అంతర్జాతీయ అవార్డు



కర్నూలు కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవకుడు, లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు ఆఫ్రికాకు చెందిన రిపబ్లిక్ ఆఫ్ ఘనా దేశం నుంచి అంతర్జాతీయ అవార్డు లభించింది. గురువారం ఆ దేశంలోని ఓయామ్ డిజిటల్ అకాడమిక్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అంతర్జాలం ద్వారా ప్రతినిధులకు అందజేశారు. 30 ఏళ్లుగా విద్య, వైద్య శిబిరాలు, సామాజిక సేవ చేస్తున్నందుకు ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

రేపు జిల్లాకు ట్రైనీ యూపీఎస్‌సీ అధికారులు

కర్నూలు రూరల్ అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): యూపీఎస్‌సీ ద్వారా నియమితులైన 15 మంది ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్, ఐఆర్‌ఎస్ అధికారులు శనివారం జిల్లాకు రానున్నట్లు ఎంపీడీవో రఘునాథ్ తెలిపారు. గురువారం మాట్లాడుతూ వీరు వివిధ మండలాల్లో శిక్షణ నిమిత్తం పర్యటిస్తారన్నారు. కర్నూలు, గార్గేయాపురం, ఓర్వకల్లు మండలం హుశేనాపురం, కల్లూరు మండలం పెద్దటేకూరుకు ఐదుమంది చొప్పున క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని వివరించారు.

రైతులను ఆదుకోవాలి


సుబ్రహ్మణ్యం శెట్టి

కర్నూలు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆర్యవైశ్య విభాగం సెక్రటరీ సుబ్రహ్మణ్యం శెట్టి డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో ఉల్లి, జొన్న, కూరగాయలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

తాగునీరు ఇవ్వడమే లక్ష్యం

సి.బెళగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ మిషన్‌ద్వారా తాగునీరు ఇవ్వడమే లక్ష్యమని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గోనేనాయక్ తెలిపారు. గురువారం మాట్లాడుతూ రూ.50 లక్షలతో తిమ్మ నదొడ్డి, సిబెళగల్ గ్రామాల్లో ఇంటింటికి కొళాయి ద్వారా నీరు ఇస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్యామల, సర్పంచ్ పాండురంగన్న, నాగ లక్ష్మి ఉన్నారు.

గుంతల పూడ్చివేత


గుంతలను పూడ్చివేయిస్తున్న అధికారులు

సి.బెళగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబందహాల్ గ్రామ రహదారిపై గుంతలను అధికారులు గురువారం పూడ్చివేయించారు. గురువారం ఆర్‌అండ్‌బీ డీఈ రమణ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి రోడ్డును పరిశిలించి, గుంతలను పూడ్చాలని సూచించారన్నారు. వచ్చే నెలలో రోడ్డు నిర్మిస్తామన్నారు. ఏఈ పెర్వీస్ ఫెబీ, ఎంపీడీవో రాణెమ్మ, కార్యదర్శి అభిషేక్‌ఉన్నారు.

సంస్మరణ సభను జయప్రదం చేయండి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నీలం రామచంద్రయ్య, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని మీడియా రూమ్ వద్ద పోస్టర్‌ను విడుదల చేశారు. వై.నరసింహులు, వెంకటస్వామి, పీడీఎస్‌యూ అధ్యక్షుడు భాస్కర్ పాల్గొన్నారు.


పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

సీసీఐ కొనుగోలు చేస్తుంది

కోడుమూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తుందని, ఇప్పటికే ప్రారంభించినట్లు ఏఈవో రవిప్రకాష్ తెలిపారు. గురువారం లద్దగిరి గ్రామంలో పొలాలను పరిశీలించారు. రైతులు ముందుకు రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఏ రోజున విక్రయానికి తరలించాలో సమాచారం తెలుస్తుందన్నారు. తేమశాతం 8-12 మించకూడదని, రంగుమారడం, నీళ్ల తడపడం, సంచుల్లో తరలించడం చేయకూడదన్నారు. అనంతరం కంది, శనగ పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలు వివరించారు.

కోటి సంతకాలతో బుద్ధి చెబుదాం


కల్లపరిలో సంతకాలను చూపుతున్న వైసీపీ నాయకులు

కోడుమూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాలతో ప్రభుత్వానికి బుద్ధి చెబుదామని వైసీపీ ఎస్ఈసీ సభ్యుడు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్ పిలుపు నిచ్చారు. గురువారం మండలంలోని పులకుర్తి, కల్లపరి, బైనదొడ్డి గ్రామాల్లో రచ్చబండ నిర్వహించి, సంతకాలను సేకరించారు. వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేసి రూ.వేలకోట్లు దండుకోవాలని కుట్రపన్నారని ఆరోపించారు. ప్రభుత్వ మెడలు వంచి ప్రైవేటీకరణను అడ్డుకుంటామని తేల్చి చెప్పారు.జడ్పీటీసీ రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను విరమించుకోవాలి



ఎమ్మిగనూరు సర్కిల్‌లో మానవహారం చేపట్టిన విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్‌లో విద్యార్థులతో మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా మాట్లాడుతూ వెనుకబడిన ఆదోని డివిజన్ గ్రామీణ ప్రాంత వాసులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రజల డిమాండ్ మేరకు గత ప్రభుత్వం వైద్య కళాశాల నిర్మాణానికి పూనుకుందన్నారు. కూటమి ప్రభుత్వం ఆగిన నిర్మాణ పనులను పూర్తి చేయకుండా నిలిపివేసి ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. శరత్ కుమార్, రంగస్వామి, తామస్, దస్తగిరి, శ్రీకాంత్, శేఖర్ శివ మోహన్ హుసేనీ వీరేష్ భార్గవి, మౌనిక పాల్గొన్నారు.

'తాగునీటి సమస్యను పరిష్కరించరా?'



తాగునీటి సమస్యపై ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యులు

ఆలూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆలూరు పట్టణంతో పాటు గ్రామాలకు తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, 15 రోజులకోసారి నీటి సరఫరా చేస్తున్నారని వైస్ ఎంపీపీ కురువ శ్రీరాములు, మండల కోఆప్షన్ సభ్యుడు బాషా, ఎంపీటీసీ సభ్యులు జీరా నాగమ్మ, ఎల్లమ్మ, దేవరాజులు పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రశ్నించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రంగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బాపురం జలాశయం నుంచి పది రోజులైనా తాగునీరు రావడం లేదని, ఎన్నిసార్లు సమావేశంలో చెప్పినా పట్టించుకోవడం లేదని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలూరుకు శాశ్వత తాగు నీటి సమస్య పరిష్కారానికి నిధులు కేటాయించాలని కోరారు. మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశానికి కొందరు వివిధ శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ఈ సమావేశంలో ఎంఈఓ కోమలాదేవి, ఏపీఓ శ్రీనివాసులు, ఈఓపీఆర్‌డీ హరున్‌రషీద్, ఏఓ వెంకటేశ్వరగౌడ్, ఫారెస్ట్ బీట్ అధికారి విమల్, ఏపీఎం ఆంజనేయ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా తుఫాను సహాయక చర్యలు

మద్దికెర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌లో ప్రజలకు అవసరమైన సహాయక చర్యలను ప్రభుత్వం సమర్థవంతంగా చేపట్టిందని టీడీపీ మండ ఎస్సీ నాయకుడు ఆనంద్ కుమార్, బీసీ సెల్ నాయకుడు రమేష్, సింగిల్‌విండో డైరెక్టర్ చిన్న పెద్దన్న తెలిపారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో అన్ని శాఖలు సమర్థవంతంగా పని చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూశారన్నారు.

ఆదోని జిల్లా సాకారమయ్యేనా?

- వెనుకబాటుతనం రద్దయ్యేనా?
- గెజిట్ ప్రకటన కోసం ప్రజల్లో ఉత్కంఠ



ఆదోని రైల్వేస్టేషన్



మున్సిపల్ మెయిన్ రోడ్డు (ఫైల్)

ఆదోని, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ తుది అంకానికి చేరుకోవడంతో రాష్ట్రంలోనే అత్యంత సుదీర్ఘ పోరాటాల్లో ఒకటిగా నిలిచిన ఆదోని జిల్లా ఆకాంక్షపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. దశాబ్దాల వెనుకబాటు, 100 కిలోమీటర్ల దూరాభారాన్ని భరిస్తున్న పశ్చిమ ప్రాంతమైన ఆదోని ప్రజలు, తమ కల సాకారం అవుతుందన్న ఆశతో నవంబరులో జరగబోయే కీలక మంత్రివర్గ సమావేశం వైపు ఆదోని ప్రజల కళ్లు ఆశగా చూస్తున్నాయి. జిల్లా పునర్విభజనపై మంత్రివర్గ ఉప సంఘం అందించిన నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫైనల్ చేయాల్సి ఉంది. త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో జిల్లాల పునర్విభజన అంశం కీలకం కానుంది.

దూరాభారమే ప్రధాన సమస్య

ఆదోని ప్రాంతం జిల్లా కేంద్రమైన కర్నూలుకు సుమారు 100 నుంచి 120 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ భౌగోళిక దూరం స్థానిక పరిపాలనను సంక్లిష్టం చేసింది. చిన్న పని కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాలన్నా, ప్రజలు ఒకరోజు మొత్తం వృథా చేసుకోవాల్సిన పరిస్థితి. ఈ కారణంగానే విద్య, వైద్యం, పారిశ్రామిక అభివృద్ధి మందగించి వెనుకబాటుకు దారి తీసిందని నాయకులు విశ్లేషిస్తున్నారు.

చారిత్రక అర్హత ఉన్న కేంద్రం

ఒకప్పుడు నిజాం, బ్రిటీష్ పాలకుల కాలంలో కీలక వర్తక కేంద్రంగా వెలుగొందిన ఆదోనికి జిల్లా కేంద్రానికి కావాల్సిన మౌలిక వసతులు పుష్కలంగా ఉన్నాయి. రైల్వే జంక్షన్, సువిశాలమైన పత్తి మార్కెట్, మెరుగైన పట్టణ మౌలిక సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. పరిపాలనా సౌలభ్యం, ప్రజల ఆకాంక్షలు అనే రెండు ప్రభుత్వ లక్ష్యాలకు ఆదోని డిమాండ్ పూర్తి అనుగుణంగా ఉందని పట్టణ మేధావులు అంటున్నారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ సహా పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు జిల్లా ఆవశ్యకతను గట్టిగా విన్నవించారు. మంత్రివర్గం నివేదికను ఆమోదించిన వెంటనే వెలువడే గెజిట్ నోటిఫికేషన్ కోసం పశ్చిమ ప్రాంత ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఒకవేళ ఆదోనికి మొండిచేయి చూపిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్థానిక జేఏసీ నేతలు హెచ్చరించారు.

బీసీ హాస్టల్‌ను పునరుద్ధరించాలి

ఆదోని రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం పెద్దతుంబళంలో మూత పడ్డ బీసీ హాస్టల్‌ను పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశు డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో మూతపడ్డ హాస్టల్‌ను వారు పరిశీలించారు. 40 సంవత్సరాలుగా పేద విద్యార్థుల కోసం పెద్దతుంబళంలో బీసీ హాస్టల్ ఉండేదని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక హాస్టల్‌ను మూసేశారని అన్నారు. తక్షణమే పేద విద్యార్థుల కోసం హాస్టల్‌ను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అధికారిని సస్పెండ్ చేయాలి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు జిల్లా వాణిజ్య పన్నుల శాఖ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి కిందిస్థాయి ఉద్యోగులను కులం పేరుతో దూషిస్తూ భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆదోని తాలూకా వైస్ ప్రెసిడెంట్ తిరుమలేష్, కోశాధికారి లక్ష్మీ నాగ రవి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, మార్కండేయులు, సందీప్ కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన

ఆదోని టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ వారోత్సవాల సందర్భంగా ఆవోపా వామ్, లయన్స్ క్లబ్ సంయుక్తంగా గురువారం ప్రభుత్వ స్త్రీల, చిన్న పిల్లల ఆసుపత్రిలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. మధుసూదన్ రెడ్డి, గైనకాలజిస్టులు డా. కీర్తి, డా. విజయ భారతి, డా. భాగ్యలక్ష్మి వ్యాధి రావడానికి కారణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బాలింతలకు, గర్భవతులకు వివరించారు. ఆవోపా అధ్యక్షుడు లయన్స్ క్లబ్ కార్యదర్శి వంకదారు శ్రీనాథ్ గుప్తా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఐఎఫ్ జాతీయ అధ్యక్షుడు డా. శివరాజ్, డా. మౌనిక, డా భారతి, ఆవోపా కోశాధికారి యతగిరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు, ప్రతాప్ ఈరన్న శెట్టి, నగరి కంటి వెంకటేష్ బాబు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు

పత్తికొండ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిధిలో అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మున్నీసాబీ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బొటనీ సబ్జెక్టుకు సంబంధించి ఖాళీ ఉందన్నారు. ఎమ్మెస్సీ, బీఈడీ అర్హత ఉండి, 50 శాతానికి పైగా మార్కులు వచ్చిన అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను గడువు లోపు ఇవ్వని వారు ఇంటర్వ్యూలకు నేరుగా దరఖాస్తులతో హాజరుకావొచ్చన్నారు. మరిన్ని వివరాలకు 8309916198 నంబర్‌ను సంప్రదించాలన్నారు. నవంబర్ 1వ తేదీన ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

18, 19 తేదీల్లో పత్తి రైతుల సమ్మేళనం

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 18,19 తేదీల్లో ఆదోనిలో రైతుల ఐక్యత, వ్యవసాయ అభివృద్ధికి పునాది కోసం రాష్ట్ర పత్తి రైతుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పేర్కొన్నారు. గురువారం ఆవకాయ కాన్ఫరెన్స్ హాల్లో రైతు సమ్మేళనం సమావేశం పట్టణ కార్యదర్శి వీరేష్ అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలో పత్తి రైతులు వర్షాభావ పరిస్థితుల వల్ల తీవ్రంగా నష్టపోయారన్నారు. మార్కెట్‌లో కనీస మద్దతు ధర కూడా పత్తి రైతులకు అందడం లేదన్నారు. భారీగా రైతు సమ్మేళనానికి రైతులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం నాయకులు జగన్నాథం లక్ష్మీరెడ్డి, సుదదర్శన్ నాగేంద్రయ్య పంపన్న గౌడ్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలి

ఆలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను, శ్రమను దోచుకునే లేబర్ కోడ్ చట్టాలను తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణమూర్తి, రంగన్న, సీపీఐ మండల కార్యదర్శి రామాంజినేయులు డిమాండ్ చేశారు. ఓబులేసు, బజారప్ప, పెద్ద ఉరుకుందు, ఉచ్చీరప్ప, దూలి, నల్లన్న, చిన్నగోవిందు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల పేర్లను బ్లాక్ లిస్ట్‌లో చేర్చండి

- ఆదేశించిన మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి



చైర్‌పర్సన్‌తో వాదిస్తున్న కౌన్సిలర్లు

ఆదోని టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వివిధ ప్రాంతాలలో అభివృద్ధి పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఎంతకాలమైనా పనులను ప్రారంభించకపోవడంపై మునిసిపల్ కౌన్సిల్ చైర్ పర్సన్ లోకేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆమె అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. పనులను ప్రారంభించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌ల పేర్లను బ్లాక్ లిస్ట్‌లో చేరుస్తామని హెచ్చరించారు. కౌన్సిలర్లు, పార్వతి, హసీనా బేగం, ఫయాజ్ మాట్లాడుతూ తమ వార్డులో అభివృద్ధి పనులు మంజూరై చాలా కాలం అవుతున్నా ఎందుకు ప్రారంభించలేదని తమ పదవీ కాలం అయిపోయాక చేస్తారా అని ప్రశ్నించారు. పట్టణ పరిధిలోని నీటి సరఫరా వీధి దీపాల నిర్వహణ కోసం 52 మంది కార్మికులను నియమించాలన్న అంశాన్ని వాయిదా వేయాలని కౌన్సిలర్ హసీనా బేగం అన్నారు. ఆమె అభ్యంతరాన్ని చైర్ పర్సన్ లోకేశ్వరి పట్టించుకోకుండా నవంబర్ ఒకటవ తేదీ నుండే తాత్కాలిక కార్మికులను విధులలోకి తీసుకోవాలని అధికారులకు ఆదేశించడం సభలో అందరినీ ఆశ్చర్యపరిచింది. తీవ్ర కరువుతో పూర్తిగా వెనుకబడిన పశ్చిమ ప్రాంతం అభివృద్ధి కోసం ఆదోని జిల్లాను ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని భావిస్తూ ప్రభుత్వానికి కౌన్సిల్ తీర్మానం చేసి పంపాలని సభ్యులు తీర్మానించారు. బసాపురం చెరువులో నీటిని పూర్తిస్థాయిలో నింపుకొనే అవకాశం లేదని రానున్న వేసవి కాలంలో పట్టణంలో నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, రఘు అన్నారు. సమావేశంలో కమిషనర్ కృష్ణ, ఎంఈ సత్యనారాయణ, హెల్త్ ఆఫీసర్ సందీప్ కుమార్, డీఈలు రామమూర్తి, గోపీనాథ్, రాజశేఖర్ రెడ్డి, ఆర్‌వో నాసిర్ పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో ప్రతిపాదనలు

మద్దికెర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మద్దికెర గ్రామంలోని నేషే వీధి, మోమిన్ వీధి, జెండాకట్ట వీధి ప్రాంతాల ప్రజలకు మంచినీరు అందించేందుకు రూ.10 లక్షలతో ప్రతిపాదనలు పంపామని డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, ఉప సర్పంచ్ కృష్ణ తెలిపారు. మూడు ప్రాంతాలకు ఎక్కువగా ఉప్పు నీరు సరఫరా అవుతుందని, మంచినీరు అందించేందుకు రూ.10 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. గ్రామంలో ఎక్కడ పైపులు లీకేజీ అయినా వెంటనే మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. అలాగే యజ్ఞం చెరువు నీరు కూడా చెరువులోకి నీరు కలుషితం కాకుండా మరమ్మతులు చేపట్టామని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

ఆలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన దేవరగట్టు మాల మల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఆలయ వైస్ చైర్మన్‌గా నియమితులైన లోకేష్‌నాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, శివప్రసాద్ తమ సామాజికవర్గాన్ని గుర్తించి ఆలయ వైస్ చైర్మన్‌గా నియమించారన్నారు. గురువారం జరిగే ప్రమాణ స్వీకారానికి ఆలయ పరిసరాల భక్తులు, పెద్దలు, టీడీపీ నాయకులు తప్పక హాజరుకావాలన్నారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

తుగ్గలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని తుగ్గలి ఎస్ఐ బాల నరసింహులు అన్నారు. మండలంలోని రాతనలోని ఆశ్రమ పాఠశాలలో గురువారం అమరవీరుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. పిల్లలు విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం రోజారమణి, ఉపాధ్యాయులు, పోలీసులు ఉన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

హాలహర్వి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన హాలహర్వికి చెందిన రంగన్న, ఎర్రెమ్మ అనే ఇద్దరు వ్యక్తులకు ఐదేళ్ల సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.15 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ మారుతి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2017లో ఓ మహిళను లైంగికంగా వేధించి అత్యాచారానికి పాల్పడిన కేసులో వీరికి కర్నూలు జిల్లా 7వ ఏడీజే కోర్టు తీర్పు ఇచ్చిందని వెల్లడించారు. రూ.15 వేలు కట్టని పక్షంలో మరో ఆరు నెలల పాటు శిక్ష ఖరారు చేస్తున్నట్లు తీర్పు వెలువడిందని ఆయన తెలిపారు.

లబ్ధిదారులను గుర్తించండి

దేవనకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గృహాలను నిర్మించుకునే లబ్ధిదారులను గుర్తించాలని ఎంపీడీవో జ్యోతి, హౌసింగ్ ఏఈ అనిరుధ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు. నిబంధనల మేరకు అర్హులైన వారు పీఎంఏవై పథకం ద్వారా గృహాలను నిర్మించుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. గతంలో ప్రభుత్వం నిర్వహించిన పథకంలో సభ్యులుగా ఉండరాదన్నారు. అర్హులైన వారు గ్రామాల్లోని సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు.

రహదారి అధ్వానం



బురదమయంగా రహదారి

మద్దికెర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బురుజుల గ్రామంలో నలరేగడి పొలాల్లోకి వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని రైతులు తెలిపారు. బురజుల గ్రామంలో మొత్తం 40 ఎకరాల రేగడి పొలాలు ఉన్నాయని.. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పొలాలకు వెళ్లే దారి బురదమయంగా మారడంతో పొలాలు వెళ్లే దారిలేక అటువైపు వెళ్లే ప్రయాణికులు, రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు. అధికారులు స్పందించి ఆ రహదారిని బాగు చేయాలని కోరుతున్నారు.

రబీ సాగుకు సన్నద్ధం

● గాజులదిన్నె ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ● 4 టీఎంసీలు నిల్వ ● భూములను సిద్ధం చేసుకుంటున్న రైతులు



గాజులదిన్నె ప్రాజెక్టు

గోనెగండ్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు, డోన్, కోడుమూరు, పత్తికొండ ప్రాంతాల రైతుల జీవనాడి అయిన గాజులదిన్నె ప్రాజెక్టు వదర నీరు చేరుతుండటంతో కళకళలాతోతుంది. గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఏటా రబీ సీజన్‌లో మాత్రమే జీడీపీ ఆయకట్టు రైతులకు సాగునీటిని అధికారులు విడుదల చేస్తారు. ప్రస్తుతం జీడీపీలో నీరు పుష్కలంగా ఉండటంతో ఆయకట్టు రైతులు పంటలను సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. గత నెల 12 నుంచి ఇప్పటి వరకు దాదాపు 22 సార్లు గేట్లు ఎత్తి వరద నీటిని జీడీపీ ఇరిగేషన్ అధికారులు హంద్రీకి వదిలారు. అయితే ప్రస్తుతం జీడీపీ 4వ గేటు ద్వార 335 క్యూసెక్కుల నీటిని హంద్రీకి వారం రోజులుగా విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 376.75 మీటర్ల నీరు(4 టీఎంసీ) ఉంది. ఎల్లెల్సీ నుంచి 190 క్యూసెక్కుల నీరు జీడీపీని చేరుతోంది. జీడీపీ నీటి నిల్వ సామర్థ్యం 4.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 4 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, రాతన, తదితర ప్రాంతాలలో వర్షాలకు కురిస్తే జీడీపీకి వరద పోటెత్తింది.

తీర్మానం చేసుకున్న సాగునీటి సంఘం సభ్యులు

రబీ సీజన్ ప్రారంబం కావడంతో నవంబరు నెల 1వ తేదీ నుంచి జీడీపీ ఆయకట్టు రైతులకు ప్రాజెక్టునుంచి నీటి విడుదలు చేయాలని కోరుతూ జీడీపీ సాగునీటి సంఘం సభ్యులు తీర్మానించుకున్నారు. ఈ తీర్మానాన్ని ఇరిగేషన్ ఎస్ఈకి ఇచ్చారు. నవంబరు నెలలో నీరు విడుదల చేస్తే త్వరగా పంటలు పండించుకునేందుకు వీలు కుదురుతుందని మార్చి చివరినాటి పంటలు పూర్తి అవుతాయని రైతులు చెబుతున్నారు.

రబీ సీజన్‌కు సిద్ధమవుతున్న రైతులు

గాజులదిన్నె ప్రాజెక్టులో గత మూడేళ్ల తరువాత ఈ ఏడాది నిండుకుండలా నీరు చేరింది. దీంతో జీడీపీ ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 10 వ తేది నుంచి రబీ సీజన్ ప్రారంభం కానుండటంతో జీడీపీ కింద ఉన్న గాజులదిన్నె, పుట్టపాశం, హెచ్ కైరవాడి, వేముగోడు, తిప్పనూరు, బోదేపాడు, కోడుమూరు, డోన్, పత్తికొండ ప్రాంతాలకు చెందిన ఆయకట్టు రైతులు రబీలో సాగు తమ పంట భూములలో పంటను సాగు చేసుకునేందుకు గాను భూములను సిద్ధం చేసుకుంటున్నారు. ఖరీఫ్ సాగు చేసిన పంటను తొలగించి దుక్కి దున్ని విత్తనాలకు సిద్ధమవుతున్నారు. ప్రాజెక్టు కింద 24500 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రతి ఏడాది దాదాపు 12000 నుంచి 13500 ఎకరాల వరకు సాగు అయ్యేది. అయితే ఈ ఏడాది ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉండటంతో మరింత ఆయకట్టు పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.



పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

వేసవిలో తాగునీటి పథకాలకు ఇబ్బంది ఉండదు

ప్రస్తుతం ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. ప్రాజెక్టు కింద ఉన్న తాగునీటి పథకాలకు నీటి ఇబ్బంది ఇక ఉండదు. బండగట్టు, డోన్, క్రిష్ణగిరికి తాగునీటి పథకాలకు, అవసర సమయంలో కర్నూలు, కోడుమూడు, గూడూరు, సి.బెళగల్ ప్రాంతాలకు కూడా తాగునీటి కి విడుదల చేస్తారు. ఇక వచ్చే రబీకి నీటి కష్టాలు ఉండవని ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు కింద 24,500 ఎకరాలు రబీలో సాగు కావాల్సి ఉంది. అయితే 12వేల ఎకరాల వరకు సాగు కావొచ్చని జీడీపీ అధికారులు అంటున్నారు. జీడీపీలోకి ఎల్లెల్సీ నీరు, మరియూ హెచ్ఎన్ఎస్ నీరు వచ్చి చేరుతుండటంతో ఈ ఏడాది ఆయకట్టు భూములకు సాగు నీటికి ఇబ్బంది లేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది 12వేల ఎకరాలు సాగు కావచ్చు

ప్రతి ఏడాది మాదిరి ఈ ఏడాది కూడా దాదాపు 12వేల ఎకరాలు సాగు కావచ్చు. రబీ సాగుకు నీరు ఇబ్బందిలేదు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదల చేస్తాం.
- మహమ్మద్ అలీ, ఏఈ, జీడీపీ

మాక్ అసెంబ్లీకి పెద్దకడబూరు విద్యార్థి

● వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో విజేతగా నిలిచిన వీరేంద్ర



వీరేంద్రను అభినందిస్తున్న ఎంఈవో, హెచ్ఎం, ఉపాధ్యాయులు

మంత్రాలయం/పెద్దకడబూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 26న జరిగే మాక్ అసెంబ్లీకి మంత్రాలయం నియోజకవర్గం తరపున పెద్దకడబూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికయ్యాడు. మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించారు. పెద్దకడబూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి వీరేంద్ర వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీల్లో విజేతగా నిలిచినట్లు ఎంఈవో రాగన్న, హెచ్ఎంలు గోట్ల చంద్రశేఖర్, జోజరాజు, లచ్చప్ప, న్యాయనిర్ణేతలు మద్దిలేటి, జీవానందపాలు తెలిపారు. గురువారం మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి, పెద్దకడబూరు, మంత్రాలయం, కౌతాళం మండలాల నుంచి ముగ్గురు విద్యార్థుల చొప్పున 12 మంది విద్యార్థులతో నిర్వహించిన పోటీల్లో వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో వీరేంద్ర విజేతగా నిలిచినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంఈవో, హెచ్ఎం, ఉపాధ్యాయులు వీరేంద్రను అభినందించారు. నల్లారెడ్డి, బసవరాజు, నాగరాజు, రాగవేణి, రామచంద్రగౌడు, సువర్ణజోషి ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి



కరణి గ్రామస్థులకు సూచనలు ఇస్తున్న వైద్యాధికారులు

కౌతాళం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి సూచించారు. మండలంలోని కరణి గ్రామంలో గురువారం వైద్యాధికారులు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలి రోగాల బారిన పడినట్లు తెలియడంతో ముందస్తుగా గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఇంటింటికి వెళ్లి ప్రజలను పరీక్షించినట్లు తెలిపారు. ప్రజలు శుద్ధమైన నీటిని కాచి తాగాలని సూచించారు. గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ఉసేనమ్మ పారిశుధ్య పనులు చేయించారు. ఈ శిబిరంలో మండల వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి: ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశించారు. మార్కెట్‌లో గోడౌన్ వద్ద గోనెసంచులు కాలిపోయి నష్టం వాటిల్లిడంతో బాధిత రైతులతో మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరగడానికి కారణాలు తెలియాల్సి ఉందన్నారు. అయితే అగ్నిప్రమాదంపై బాధితులు పలు అనుమాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆ మేరకు దర్యాప్తు చేసి పూర్తిస్థాయిలో విచారించాలని పోలీసులకు తెలిపారు.

సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయించుకోవాలి

సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాల్లో రైతులు పత్తిని ఆ కేంద్రాల్లో విక్రయించుకోవాలని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి సూచించారు. అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కూడా కలెక్టర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. రబీలో సాగునీరు అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీడీపీ ప్రాజెక్టు కింద రైతులకు సమృద్ధిగా నీరు అందజేస్తామన్నారు. ఎల్లెల్సీ నీటి విడుదలపై నవంబరు 7వ తేదీన సమావేశం ఉందని, ఆ రోజు నీరు ఎప్పటి వరకు విడుదల చేస్తారో తెలుస్తుందన్నారు. అయినప్పటికీ రైతులు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి చంద్రమౌళి, వైస్ చైర్మన్ అంజి, నాయకులు కాశింవలి, గోపాల్, మద్దిలేటి, కె. తిమ్మాపురం ఉరుకుంద, బీజేపీ నాయకులు నరసింహులు, శివ, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ మధుసుదన్‌రెడ్డి, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.



గోడౌన్ వద్ద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

● పట్టణంలోని 17వ వార్డు మాజీ కౌన్సిలర్ బోయ లక్ష్మి, జయన్న దంపతుల కుమారుడు రామాంజనేయులు, అలాగే జయన్న తల్లి ఇటీవల కాలంలో మృతి చెందారు. దీంతో వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే బీవీ జయనాదేశ్వరరెడ్డి పరామర్శించారు.

● పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి దేవాదాయశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నందవరం మండలంలో గురుజాల గ్రామంలో వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయం అభివృద్ధిపై ఈవో రాంప్రసాద్ తో సమీక్షించారు. ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై అడిగి తెలుసుకున్నారు. గురుజాల గ్రామంలోని రామలింగేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లి అభివృద్ధిపై పూర్తిస్థాయిలో చర్చించనున్నట్లు తెలిపారు.

ఎస్ఐని కలిసిన టీడీపీ నాయకులు



ఎస్ఐని సన్మానించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నందవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నూతనంగా వచ్చిన ఎస్ఐ తిమ్మారెడ్డిని గురువారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేశాయి మాధవరావు, మాజీ జడ్పీటీసీ ఈరన్నగౌడు, రైస్ మిల్ నారాయణరెడ్డి సన్మానించారు. వీరితో పాటు టీడీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, మునాఫ్, తిమ్మప్ప, లచ్చప్ప, గజేంద్రరెడ్డి, జబ్బార్, నాగేంద్రప్ప, మణీ, శాంతి, ఉరుకుంద,, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఈరన్న, పంపయ్య, మల్లి, రియాజ్ ఉన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ అందరూ శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. గ్రామాల్లో ఏమైనా గొడవలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రాఘవరాయలకు పంచామృతాభిషేకం

మంత్రాలయం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద స్వామి మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. పీఠాధిపతి మూలరాములకుపూజలు చేసి బృందావనానికి హస్తోధకంతో పాటు మహా మంగళ హారతులు ఇచ్చారు. ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సీఐ రామాంజులు,ఎస్ఐ శివాంజల్, పోలీసులు, సెక్యూరిటీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ప్రత్యమ్నయ ఏర్పాట్లు చేశారు. ప్రసాదాల కొరత రాకుండా మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

అవినీతి నిర్మూలనకు కృషి చేయాలి

గోనెగండ్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో మణిమంజరి పిలుపునిచ్చారు. గురువారం గోనెగండ్లలోని ఎంపీడీవో కార్యాయలం దగ్గర సిబ్బందితో అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరం కృషి చేస్తామని ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాటుకోళ్ల పెంపకంపై అవగాహన

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో షెడ్యూల్డ్ కులాల రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి నాటుకోళ్ల పెంపకంపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నాటుకోళ్లను పెంచే రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చలికాలంలో కోళ్లను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. చిన్నపాటి కోళ్లు చలికి మరణించే ప్రమాదం ఉంటుందని, వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నాటుకోళ్ల వ్యాపారంతో చిన్నాపాటి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ గురువిష్ణు, డాక్టర్ నిరంజన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

'ఇల్లు నిర్మించుకోకపోతే స్థలం రద్దు'

మంత్రాలయం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలో గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇంటి నిర్మాణం చేపట్టక పోతే రద్దు చేస్తామని డిప్యూటీ ఎంపీడీవో రామాంజినేయులు తెలిపారు. గురువారం చెట్నహళ్లి గ్రామంలో ఇంటి నిర్మాణాలపై లబ్ధిదారులకు హౌసింగ్ ఏఈ ప్రవీణ్, గ్రామ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వచ్చే ఏడాది మార్చిలోపుగా ఇళ్లను పూర్తి చేసుకోవాలన్నారు. బేస్‌మెంట్, లెంటల్, రూఫ్‌లెవల్, స్లాబు వంటి వివిధ దశల్లో పెండంగ్‌లో ఉన్న నిర్మాణాలు పూర్తిచేయాలని సూచించారు. ఇంజనీరింగ్ అసిస్టెంటు, గ్రామ కార్యదర్శులు లబ్ధిదారులతో మాట్లాడాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మంచాల సింగిల్ విండో డైరెక్టర్ చాపల నాగేష్, మేకల మల్లేష్, బూత్ మెంబర్ వీరేష్, ఎస్ఎంసీ చైర్మన్ పరమేష్, మల్లేష్ గోపాల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ భవానీ పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

నందవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం నందవరం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఇటీవల బల్లి, పురుగులు పడిన అన్న విద్యార్థులకు వడ్డించబోగా పురుగులు కనబడగా వెంటనే వాటిని చల్లి మళ్లి భోజనం తయారు చేశారనే విషయం తమ దృష్టికి వచ్చిందని తహసీల్దార్ తెలిపారు. భోజనంలో చిన్న పొరపాటు జరిగినా నిర్వాహకులు, సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఐదెకరాల్లో ఉల్లి పంటను దున్నేశారు



కడివెళ్లలో ఉల్లిపంటను దున్నేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని కడివెళ్ల గ్రామానికి చెందిన రైతు వెంకటరాముడు తనకున్న ఐదు ఎకరాల పొలంలో ఉల్లిపంటను సాగుచేశాడు. ఇందుకోసం రూ.3 లక్షలకు పైగా ఖర్చు చేశాడు. ఉల్లిపైరు ఎదుగుతున్న సమయంలో అధికవ వర్షాలు కురిశాయి. దీంతో పంటను కోసేందుకు అవకాశం లేకపోవడం, ఉల్లిధర కూడా భారీగా పతనం కావడంతో చేసేదేమీలేక రైతు ట్రాక్టర్‌తో దున్నివేశాడు. పంటను కోసినా వచ్చేదిగుబడి కూలీలకు సరిపోదని రైతు వాపోయాడు. తప్పని పరిస్థితుల్లో పంటను దున్ని వేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పోస్టరు విడుదల



పోస్టరును విడుదల చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎంఎల్), చంద్ర పుల్లారెడ్డి పార్టీలలో పని చేసి అమరులైన కార్మికుల సంస్మరణ సభల పోస్టరును ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్ పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ సీపీఐ (ఎంఎల్), చంద్ర పుల్లా రెడ్డి పార్టీలలో పని చేసి వారి జీవితాలను ప్రజల కొరకు అంకితం చేశారన్నారు. అమరులైన కార్మికుల సంస్మరణ సభలు ప్రతి గ్రామాలలో నవంబరు 1వ తేదీ నుంచి 30వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిన్న కృష్ణ, జయన్న, లాజర్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సచివాలయ ఉద్యోగి మృతి



హనుమంతయ్య (ఫైల్)

ఎమ్మిగనూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధి లోని వడ్డెర సంఘం ఏరియా సచివాలయంలో వార్డు వెల్ఫేర్ సెక్రటరీగా పని చేస్తున్న హనుమంతయ్య (50) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి గురువారం హనుమంతయ్య మృదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. అలాగే ప్రభుత్వం తరుపున అంత్యక్రియల నిమిత్తం రూ. 25వేలు నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ గ్రామ, వార్డు సచివాలయాల నుంచి సమకూరిన రూ.52 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబానికి అందజేశారు. మున్సిపల్, సిబ్బంది ఉన్నారు.

'రోజుకు 1300 క్వింటాళ్ల పత్తి కొనాలి'

మంత్రాలయం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని పత్తి రైతుల నుంచి రోజుకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సీసీఐ ద్వారా 100 మంది రైతుల నుంచి 1300 క్వింటాళ్లు కొనాలని మండల వ్యవసాయ అధికారి జీరా గణేష్ సూచించారు. మంత్రాలయం శ్రీరాఘవేంద్ర జిన్నింగ్ మిల్లు వద్ద రైతులు తెచ్చిన పత్తి నాణ్యతను పరిశీలించారు. సీసీఐ, రైతులు, మిల్లు యజమానులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందకు సీసీఐ ద్వారా క్వింటానికి రూ.8,110కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అన్నదాతలు రైతు సేవాకేంద్రాల వద్ద పత్తి అమ్మకానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. శని, ఆదివారాల్లో కూడా పత్తిని కొనుగోలు చేయాలని రైతులు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏఈవో తిరుమలరెడ్డి, ఎంపీహెచ్ఈవో బసవరాజు, సీసీఐ అధికారులు, శ్రీకాంత్ ఆచార్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో రోడ్డు ప్రమాదాల నివారణ

పెద్దకడబూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అవగహనతతోనే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు అని ఎస్ఐ నిరంజన్ రెడ్డి, ఆర్టీవో ఆవేష్ ఖాన్ అన్నారు. గురువారం మండలంలోని హనుమాపురం గ్రామ సమీపంలోని ఎస్ఎంఎల్ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. అలాగే కళశాలలో ర్యాగింగ్ పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలు బాగా పేరిగిపోయి ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. సైబర్ నేరాల్లో విద్యావంతులే ఎక్కువగా మోసపోతున్నారన్నారు. సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.